ప్రముఖాంధ్ర

ప్రపంచ తెలుగుల మానస పత్రిక

ఫిబ్రవరి 2019

సంపుటి : 25 **290** సంచిక : 2

మా తెలుగు తల్లికి మల్లె పూదండా! మా తెలుగు భాషకు మంగళారతులూ!

ప్రభుత్వ, ప్రజా – తెలుగు సభల్లో ఏ సభ చూచినప్పటికీ, 'మా తెలుగు తల్లికి మల్లెపూదండ' యని ప్రార్థనా గీతం, పాడుతూ, తృప్తిపడుతూ, తుళ్లిపడిపోతున్నాం. 'చంద మామతో – నీవు లేక నిలువజాలమనీ, నీవు రాకా నిలువలేమనీ పాత పుస్తకాల్ని దుమ్ము దులిపి, అన్నమయ్య రాగిరేకులను వెదికి వెదికి, తెలుగు సంబంధ, ప్రబంధ కవితల్ని సహితమూ పట్టి, బట్టీ పడ్తున్నాం.

ప్రభుత్వంలోని ముఖ్యమంత్రి నుంచీ ప్రతీ మంత్రీ, ప్రతీ ప్రజాబంధూ, తెలుగుభాష విశాల ప్రపంచవ్యాప్తంగా ప్రతీ తెలుగు వాని నోటా పలుకాలని నినాదాలు చేస్తున్నాం, సభలు జరుపుతున్నాం, ప్రభుత్వం ప్రజ కూడా కరపత్రాలను పంచు తూంది. అధికార భాషా సంఘం అలజడి చేస్తూంది. అనేక మంది సభ్యులు, సంఘాలు, అధికార అనధికార కార్యకర్తలు, తెలుగు మహోద్యమ నాయకులు తెలుగంటే ప్రాణమని గొప్పలు పోతాం. శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాల్లా, తెలుగుభాషా బ్రహ్మోత్సవాలు జరిగాయ్. అందరూ ముక్త కంఠంతో తెలుగు, వెలుగును చూడవలసిందే – అన్నారు. ప్రతిపక్షాల వారు కూడా వంత పలికారు.

ఏదో జరుగుతుందనీ, స్వాతంత్ర్యం రాకకు పూర్వం ఉన్న తెలుగు సిరులు విరుస్తాయనీ, సాహితీ పారిజాతాలు విరబూస్తా యనీ ఆశించిన మనకు, ప్రభుత్వ పాఠశాలలో ఒకటవ తరగతి నుంచే ఆంగ్ల మాధ్యమాన్ని అమలు జరుపు తున్నామని చెప్పడంతో ఆశలు నిరాశలయ్యాయి.

'తల్లి ఒక్కటి నీకు తెలుగోడా' అన్న వేములపల్లి కృష్ణ గారి ఆశాభావం అడుగంటింది.

మా తెలుగు తల్లికి మల్లెపూదండా అంటూ సభలకు తెస్తున్న మల్లెపూదండను చేతుల్లోనే ఉంచుకుని, అచేతనుడు కావాల్సి వస్తూన్నది. తెలుగును రెండవ జాతీయ భాషగా చేయాలని కోరుకునేది ఏదో ప్రయోజనాన్ని ఆశించేదిగా కనిపిస్తూందేగానీ 'తెలుగుభాష'ను వ్యాప్తింప చేయాలన్న ధ్యేయం, భావం తెలుగు ప్రభుత్వాలకు ఉన్నట్టుగా తోచడం లేదు. ఈ భాషా ప్రయుక్త రాష్ట్ర ప్రయోజనం తెలుగువారికి సిద్ధించినట్టుగా తోచడం లేదు, మున్ను చెన్నపట్టణంలోనూ, అనేక తమిళనాడు పట్టణాల్లో తెలుగు పిల్లలకు లభించిన చదువులు కాలదోషానికి గురియై భ్రష్టుపట్టిపోయాయి. భాషా రాష్ట్ర ఏర్పాటు వలన తెలుగు 'ఏకాకి'గా ఎటూగాకుండా పోయిందని చెప్పక తప్పడం లేదు. కొండ నాలుకకు మందు వేస్తే ఉన్న నాలుక ఊడినట్టు ప్రత్యేక ఆంధ్రం ఏర్పడిన తరు వాత తెలుగు భాషాభ్యాసం అడుగం టుతూ వస్తున్నది అన్నది పరమ సత్యం.

బుధజన విధేయుడు

– గోటేటి శ్రీరామారావు

(ఫిబ్రవరి 2008 ప్రముఖాంధ్ర)

Founder Editor : **GOTETI SRI RAMA RAO**, Editor : **GOTETI VENKATESWARA RAO**
Printed, Published & Owned by **G.V.RAO**, Associate Editor
at **GOTETI GRAPHICS**, 16 (64), Thambiah Reddy Road, West Mambalam, Chennai - 33.
Phone : 91-44-24742091, 91-44-23716322, 91-44-24894145 - Tele Fax : 91-44-23716322
www.pramukhandhra.org/E.mail : pramukhandhra95@gmail.com
YEARLY SUBSCRIPTION : RS. 216/- PROMOTERS SUBSCRIPTION : RS. 2116/-



సందేశాత్మక హాస్యం

జంఘాల శాస్త్రి పేరు విన్నారా? పోనీ, షేక్ పీరు సాహెబు లేదా హనుమాండ్లు ఇత్యాది నామ ధేయాలైనా ??... ఈ నామధేయాల సృష్టికర్త జంఘాల శాస్త్రి కాగా, సదరు శాస్త్రిని సృష్టించినదే పానుగంటి లక్ష్మీ నరసింహారావు. తెలుగునాట హాస్య రచనలలో అందె వేసిన చేయి. ఈ ఫిబ్రవరి 11వ తేదీకి ఆయన జన్మించి సరిగ్గా నూట యాభై సంవత్సరాలు పూర్తవుతాయి. సాహిత్యాభిమానులకు పానుగంటి వారి పేరు వినగానే కంఠాభరణము గుర్తు వస్తుంది. నా బోంట్లకు మాత్రం జంఘాలశాస్త్రి, సాక్షి సంపుటాలే స్ఫురణకు వస్తాయి. మొత్తం మూడు సంపుటాలలో మొత్తం 148 వ్యాసాలున్నాయి. వీటిలో జంఘాల శాస్త్రి ఉపన్యాస ఝరి వర్ణించడం మన తరం కాదు. మచ్చికు పది మంది స్త్రీలు ఒక చోట చేరితే ఆ దృశ్యం యెలా ఉం(టుం)దో చెప్పడానికి శాస్త్రిగారు ప్రయోగించిన పద సముచ్చయాలను గమనించండి. నవ్వు ఆపుకోగలిగితే అది మరో నవ్వాత్మక సంఘటనే అనుకోవాలి. కదా

"కొర్నాటి చీరలవారు, బనారసుకోకలవారు, బరంపురపు పీతాంబరములవారు, సన్నకుసుంబాచీరలవారు, గోచికట్లవారు, గూడకట్లవారు, చుట్టుత్రిప్పులవారు, మేలిముసుగులవారు, వ్రేలుముళ్ళవారు, జడచుట్లవారు, వంకకొప్పులవారు" .... ఇదీ వరస...

ఇక మరో రసధార... "మ్యావుమని కూయలేని పిల్లి యెచ్చటైననుందునా? కిచకిచలాడలేని కోతిని మీరెక్కడైన చూచితిరా? ... అయ్యయ్యో. మనుజుడే. అంత మనుజుడే. ఆంధ్ర మాతాపితలకు బుట్టినవాడే. అట్టివాడాంగ్లేయభాషనభ్యసించినంత మాత్రమున ఇప్పుడాంధ్రమున మాట్లాడలేకుందునా? ఆశ్చర్యము, అవిశ్వాసనీయము. అసత్యము. ఆంధ్రమున మాటాడకుండ చేసినది అశక్తికాదు. అనిష్టత. అసహ్యత. అది శిలాక్షరమైన మాట... తెలుగుబాస యంత దిక్కుమాలిన బాస లేదనియే యా యాంగ్లేయ తేజస్సు నమ్మకము". ఇది ఎందుకో చెప్ప బని లేదు.

ఇంతటి ప్రతిభా విశేషాలు గల పానుగంటి వారు రాజమహేంద్రిలో వేంకట రమణయ్య, రత్నమాంబ దంపతులకు జన్మించారు. రమణయ్యగారు మంచి గాయకులు, విద్వాంసులు. మన హీరోగారికి చిన్నప్పటి నుంచే నాయకత్వ లక్షణాలున్నాయి. పది మందినీ పోగేసుకుని నాటకాలాడటం, సంఘసేవా కార్యక్రమాలు చేపట్టడం అలవాటు. కానీ ఇతని బృందం చేష్టలు రాజకీయ నాయకులకు గిట్టేవి కావు. మూఢాచార పరాయణులకూ వేసటే. దాంతో పరిస్థితులను ఆకళింపు చేసుకున్న రమణయ్యగారు రాజకీయాల వల్ల ఉపయోగం లేదనీ, మంచి ఉద్యోగి కావాలనీ, అంతగా కావాలనుకుంటే రచనల ద్వారా సేవ చేయవచ్చుననీ బోధించారు. నిజమే అనుకున్న నరసింహారావు రచనా వ్యాసంగంలో పడ్డాడు. చదువులో తక్కువేమీ కాదు గానీ, తండ్రి చదువు, చదువు అని తిడతాడేమోనన్న శంకతో తన రాతలను తల్లికీ, మిత్రులకూ మాత్రమే చూపేవాడు. విశేషమేమిటంటే బడి రోజుల్లోనే ఇతను రాసిన వో నాటకాన్ని అక్షరం వదలకుండా ఉపాధ్యాయులే నటులై ప్రదర్శించడం. విక్టోరియా రాణి జన్మదినోత్సవం సందర్భంగా సర్కారు వారి ఆదేశానుసారం బడిలో ప్రదర్శించేందుకై ప్రధానోపాధ్యాయుడే ఇతని చేత హాస్య నాటిక వ్రాయించగా దానినే ఆ ఉపాధ్యాయులు ప్రదర్శించారన్నమాట.

సరే, హీరోగారు బి.య్యే. అయిందనిపించాడు. కానీ న్యాయవాదం చదవడం వీలు కాలేదు. చేత పైసలు లేకపోవడంతో టీచరుగా స్థిరపడ్డారు. ఈయన ధోరణి చూసి పిల్లలూ, వారి పెద్దలూ మొదట భయపడినా తర్వాత మాట కరకు, మనసు వెన్న అని గ్రహించారనుకోండి. అయితే ఆ రోజుల్లోనూ బతకలేక బడి పంతులే గనుక విడిగా ట్యూషన్లు చెప్పుకునేవాడు. అలా ఓ జమీందారుకు చేరువై ఆయన ఇలాకాలో దివానుగా యెదిగాడు. కానీ అక్కడి అక్రమాలను తనదైన ధోరణిలో బయటపెడుతూండడంతో బంధువులు పగబట్టి జమీందారుకు ఏవేవో నూరిపోసి బయటకు సాగనంపారు. అయితే కలం బలం ఉన్నవాడు గనుక దైవ బలం తోడై పిఠాపురం జమీందారు వద్దకు చేరగలిగాడు.

ఆ సమయంలోనే తణుకు నుంచి వెలువడే 'సువర్ణలేఖ' అనే పత్రికలో 'సాక్షి' వ్యాసాలు వెలుగు చూడసాగాయి. హాస్య రచయితగా పేరు గడిస్తూనే సంఘంలోని దురాచారాలనూ, అన్యాయాలనూ, అక్రమాలనూ తన రచనల ద్వారా యెండగడుతూ వచ్చిన నరసింహారావు సారంగధర, ప్రచండ చాణక్యము, విచిత్ర వివాహము ఆదిగా పదుల సంఖ్యలో రచనలు సాగించారు. ప్రతి ఒక్కటీ గిలిగింతలు పెట్టే హాస్యంతో పాటు వెలలేని సందేశాన్ని కూడా అందించడం మనందరం ఆనందించదగిన ప్రత్యేకత. తెలుగు జాతికి ఇంతగా సేవలందించిన నరసింహారావు 1940లో స్వర్గస్థులైనారు.

– పి.వి.ఆర్. గోపీనాథ్

జీవితంలో హాస్యం

1977లో మా అక్కయ్య (దొడ్డమ్మ కూతురు) పెళ్లి బెజవాడలో జరిగింది. అప్పటికి మా దొడ్డమ్మ వాళ్ళు మొగల్రాజపురం నుంచి సూర్యారావుపేటకి మారారు. వాళ్ళ ఇంటికి దగ్గరలోనే గంగరాజు కళ్యాణ మంటపంలో మా అక్కయ్యకి వివాహం అయింది. (ఆతర్వాత దాదాపు మళ్ళీ పదహేను ఏళ్ళకి అదే కళ్యాణ మంటపంలో నా బాల్యమిత్రుడు గరిమెళ్ల విశ్వేశ్వరరావు పెళ్లికి వెళ్ళాను). సాయంత్రం ముహూర్తం అవటాన, రాత్రి సెకండ్ షోకి "సువర్ణ సుందరి" కనకదుర్గ టాకీస్‌లో ఆడుతూ వుంటే వెళ్ళాము. ఒకవైపు సినిమా ఎంతకీ అవకపోవటం, మరోవైపు నేను పెళ్లి హడావుడిలో అలిసిపోయి వుండటం వల్ల సినిమా మధ్యలో నిద్రపోయాను. నిద్ర లేచి సినిమా మళ్ళీ చూస్తుండగా హీరో నాగేశ్వరరావు ఎంతకీ కనిపించకపోవడంతో "నాగేశ్వరరావు ఏడి" అన్న నా మాట విని మా చిన్నక్కయ్య. "ఆ రాయే నాగేశ్వర రావురా" అంది (సినిమాలో శాపం వల్ల నాగేశ్వర రావు శిలగా మారతాడు). హాల్ లోని జనాలు ఘొల్లుమని నవ్వారు.

❋ ❋ ❋

దైనందిన జీవితంలో కొన్నిసార్లు కంగారులో చేసే పొరపాట్లు హాస్యంగా వుంటాయి. బెజవాడ లీలా మహల్‌లో చాలానే ఇంగ్లీష్ సినిమాలు చూసాను. లీలా మహల్ దగ్గర పుష్పాల రంగయ్య షోడా దుకాణం వుండేది. ఆ దుకాణం పన్నీర్ షోడాకి అప్పట్లో పెట్టింది పేరు. ఆ రోజుల్లోనే పావలాకి అమ్మేవారు. ఎప్పుడు లీలా మహల్ కి వెళ్ళినా అక్కడ పన్నీర్ షోడా తప్పకుండా తాగేవాళ్లము. ఒకసారి బెజవాడ వెళ్ళినప్పుడు సాయంత్రం మద్రాసుకి ట్రైన్ వుంది అనగా మా చిన్నన్నయ్య బలవంతంగా లీలామహల్‌లో ఇంగ్లీష్ సినిమా "గ్రేట్ ఎస్కేప్"కి లాక్కెల్లాడు. సినిమా అయ్యి పరుగు పరుగున రైల్వే స్టేషన్ కి వెళ్లి ట్రైన్ ఎక్కి నా (రిజర్వేషన్) సీట్‌లో కూర్చున్నాక మా చిన్నయ్య చెమటలు కక్కుకుంటూ నాకు వీడ్కోలు ఇచ్చాడు. రెండు నిమిషాలు అయ్యిందో లేదో "ఇక్కడ రవి అన్న పేరు గల వారు ఎవరండీ" అంటూ ఒక పెద్ద మనిషి పెద్దగా అరుచుకుంటూ వచ్చాడు. "నేనే అండీ అన్నాను" (నా నిక్ నేమ్ రవి. నన్ను ఇంట్లో అందరూ రవీ అనే పిలిచేవారు). మీ అన్నయ్య సుబ్రహ్మణ్యం అంట మీకు ఈ టికెట్ ఇవ్వమన్నారు అని బెజవాడ నుంచి మద్రాసుకి వెళ్ళే రిజర్వేషన్ ట్రైన్ టికెట్ నా చేతిలో పెట్టాడు. నా జేబులో వున్న టికెట్ తీసి చూద్దును కదా అది బెజవాడ రైల్వే స్టేషన్ ప్లాట్ఫారం టికెట్! అప్పుడు నాకు అర్ధం అయ్యింది కంగారులో మా చిన్నన్నయ్య నాకు మద్రాసు టికెట్ కి బదులుగా ప్లాట్ఫారం టికెట్ ఇచ్చి తనదగ్గర నా మద్రాసు టికెట్ పొరపాటున అట్టే పెట్టుకున్నాడని. నేను కూడా ట్రైన్ ఎక్కే కంగారులో నాదగ్గర వున్న టికెట్‌ని సరిగ్గా చూసుకోలేదు. నన్ను ట్రైన్ ఎక్కించాక వెంటనే తన జేబులో చెక్ చేసుకోవడం వల్ల పొరపాటు గ్రహించి అప్పటికే ట్రైన్ బయలుదేరడం వల్ల నా బోగీ లోనే కిటికీ దగ్గర కూర్చున్న ఈ పెద్ద మనిషికి నా టికెట్ ఇచ్చి నాకు అందచేయమని చెప్పాడని తెలిసింది.

❋ ❋ ❋

తెలియని విషయాలు మనకి తెలుసు అనుకుని ప్రవర్తించడం వల్ల కొన్నిసార్లు మనం నవ్వుల పాలవుతాం. మద్రాసు లో పుట్టి పెరగటం వలన నాకు చిన్నప్పుడు హిందీ వచ్చేది కాదు. 1978 లో తొలిసారి హైదరాబాద్ వెళ్ళాం. నాంపల్లి రైల్వే స్టేషన్ నుంచి మెహదీపట్నం వెళ్ళే బస్సు ఎక్కాం. కండెక్టర్ మమ్మల్ని చూసి "అందర్ జావో" అన్నాడు. నేను అతి తెలివి ఉపయోగించి జావో అంటే వెళ్ళు కాబట్టి అందర్ జావో అంటే మమ్మల్నందరినీ లోపలికి వెళ్ళమన్నాడని అనుకుని మా వాళ్ళనందరినీ లోపలికి వెళ్ళమన్నాను. "లోపల ఒక సీటు ఖాళీ గావుంది అని నేను నిన్ను లోపలి వెళ్ళమన్నాను. మీవాళ్ళనందరినీ కాదు." అన్నాడు కండక్టర్ తెలుగులో నాకు హిందీ రాదనీ గ్రహించి. అప్పుడు తెలిసింది నాకు హిందీలో అందర్ అంటే అందరూ కాదు లోపలికి అని.

❋ ❋ ❋

కొన్ని సందర్భాలలో మనం హాస్యంగా మాట్లాడుతున్నాం అని మనం అనుకున్నా అది ఇతరులకి నొప్పించే పరిస్థితి కలిగించవచ్చు. బాపూ రమణలు కృష్ణ హీరోగా "కృష్ణావతారం" అనే సినిమా తీసారు. మాకు యువరంజని అనే సాంస్కృతిక సంస్థ అప్పట్లో మద్రాసులో వుండేది. దాంట్లో తెలుగు సినిమాలు ప్రీ వ్యూ (సినిమా విడుదలకి ముందు షో) వేసేవాళ్లం. కృష్ణావతారం సినిమా చూసాక బయటికి వస్తూ నేను నా మిత్రుడు శ్రీపతిరావుతో (ఈయన దురదృష్టవశాత్తు పిన్న వయస్సులోనే మరణించాడు) "బాప్ రే ఈ సినిమా బాపూ, రే (సత్యజిత్ రే) కలిసి తీసినట్టు వుంది" అన్నాను. మా పక్కనే ఒక పెద్ద మనిషి వెడుతూ నా మాటలు విన్నారు. ఆయన పేరు తెలియకపోయినా నాకు వారి ముఖ పరిచయం బాగానే వుంది. ఆయన ఆడిటర్ అయిన మా పెద్ద నాన్నగారి దగ్గరకి వాళ్ళ లెక్కలు చూపించుకోవటానికి తరచూ వచ్చేవారు. ఆయన చివాలున నాకేసి తలెత్తి చూడటం నేను పై వాక్యాలు అంటూ వారికేసి చూసి నవ్వటం వెనువెంటనే జరిగిపోయాయి. నా మిత్రుడు శ్రీపతిరావు నన్ను జబ్బ పట్టుకుని బరబర లాక్కుంటూ వెళ్లి కొంచం దూరం వెళ్ళాక "ఆయన ఎవరనుకుంటున్నావు? ముళ్ళపూడి వెంకటరమణగారు" అన్నాడు. అప్పటికే ఆయన నా కామెంట్స్ విని మౌనంగా తల వంచుకుని వెళ్ళిపోయారు.

❋ ❋ ❋

అప్పుడప్పుడు మన నమ్మకాలు, మన ప్రవర్తన హాస్య సన్నివేశాలకి దారి తీస్తాయి. దాదాపు రెండున్నర దశాబ్దాలు మద్రాసు లో వున్నప్పటికీ మా అమ్మమ్మ కి అరవం అస్సలు వచ్చేది కాదు. పైగా ఆవిడ అరవ భాష నేర్చుకునే ప్రయత్నం కూడా చెయ్యలేదు. కానీ చిత్రం ఏమిటి అంటే ఆవిడ అందరితో తెలుగులోనే మాట్లాడేది. పాత మాంబళం(వెస్ట్ మాంబళం) లో బజారులో దుకాణాలకి వెళ్లి కూరగాయలు, సరుకులు కొనుక్కుని వచ్చేది. మా అమ్మమ్మ తో బజారుకి వెళ్ళినప్పుడు నాకు చాలా గమ్మత్తుగా అనిపించేది. ఈవిడేమో అచ్చ తెలుగులో (గోదావరి యాస) బేరాలు పెట్టేది. దుకాణదారులు తమిళంలో మాట్లాడే వారు. మొత్తానికి అంతా సవ్యంగా జరిగేది. ఈ సన్నివేశం చూస్తున్నప్పుడు నాకు వింతగా అనిపించేది. నేను అరవంలో తర్జుమా చేస్తానంటే ఆవిడ "నీకేమి తెలియదు. నువ్వు ఊరుకో" అని వారించేది. నేను మనసులోనే నవ్వుకునే వాడిని. " తెలుగు భాష వచ్చినా వీళ్ళు అరవం లోనే మాట్లాడతారు. వీళ్ళకి భాష రాక కాదు..." అని సాగతీసేది మా అమ్మమ్మ. మా అమ్మమ్మకి అరవం అయితే ఒక్క ముక్క కూడా రాలేదు కాని ఆవిడతో తరచూ మాట్లాడి చివరికి చాలామంది మా ఇంటి చుట్టూ పక్కల వుండే కొట్ల వాళ్లకి తెలుగు మాట్లాడటం మాత్రం వచ్చింది.

❋ ❋ ❋

ఒక్కొక్కప్పుడు మన తొందరపాటుతనం మనకి నవ్వు తెప్పిస్తుంది. నేను 1981లో

డిగ్రీ పాస్ అయిన వెంటనే మద్రాసు టీ నగర్ లోని కేసరి ఉన్నత పాఠశాలలో ప్లస్ వన్, ప్లస్ టూ విద్యార్థులకి పార్ట్ టైం టీచర్ గా చేరాను. మొదటి రోజు స్కూల్ కి వెళ్లి ప్రధాన ఉపాధ్యాయురాలుని కలిసాను. ఆమె నన్ను చూసిన వెంటనే, "నువ్వు యూనిఫారం లేకుండా స్కూల్‌కి ఎందుకు వచ్చావు?" అని మందలించింది. నేను కాస్త ఖంగారుపడ్డాను ఈ స్కూల్‌లో ఉపాధ్యాయులకి కూడా యూనిఫారం ఉంటుందా అని. ఇంతలో ఆఫీసు గుమాస్తా వడివడిగా ఆవిడ రూంకి వచ్చి "మేడం. ఈయన కొత్తగా ఇవాళ జాయిన్ అవుతున్న ఉపాధ్యాయుడు " అని సర్దిచెప్పాడు.

* * *

చాలాసార్లు జీవితంలో మనుషుల మధ్య కమ్యూనికేషన్ గాప్ హాస్యానికి దారి తీస్తుంది. జూన్ 1990 లోనా వివాహం నిశ్చయం చేసారు మా పెద్దలు. సెప్టెంబర్ ఇరవైన నా వివాహం ముహూర్తం. ఆగష్టు నెలలో ఒక సారి వేరే పని మీద హైదరాబాద్ వెళ్లటం జరిగింది. అమ్మాయి వాళ్ళది హైదరాబాద్. తిరుగు ప్రయాణం నాడు నాంపల్లి రైల్వే స్టేషన్‌లో కలుద్దామని నేను, నా కాబోయే శ్రీమతి అనుకున్నాం. నేను నిర్ణీత సమయం కన్నా గంట ముందుగానే వెళ్లి స్టేషన్ లోపల నిరీక్షించ సాగాను. ట్రైన్ కూడా వచ్చేసింది కానీ నా కాబోయే శ్రీమతి రాలేదు. ఆరోజుల్లో ఇప్పట్లో లాగా సెల్ ఫోన్స్ లేవు. ట్రైన్ బయలుదేరే సమయం అయింది. ఇంక ఆమె రాదనీ నిర్ధారించుకుని నిరాశగా ట్రైన్ ఎక్కాను. ట్రైన్ బయలుదేరుతుందనగా నా కాబోయే శ్రీమతి, ఆమె అన్న వడివడిగా (దాదాపు పరిగెట్టుకుంటూ) వస్తూ కనిపించారు. అప్పటికే ట్రైన్ వేగం పుంజుకుంది. కొన్ని రోజుల తరవాత నాకు తెలిసింది ఏమిటి అంటే వాళ్ళిద్దరూ రెండు గంటలుగా నాంపల్లి రైల్వే స్టేషన్ బయట నాకోసం ఎదురు చూస్తూ నిలబడ్డారని. నేను వాళ్ళ కోసం స్టేషన్ లోపల ఎదురు చూస్తున్నాను !

* * *

భాష, మాండలీకాలు కూడా కొన్నిసార్లు నవ్వు పుట్టించే సంఘటనలు కల్పిస్తాయి. నా దగ్గర మనోహర్ అనే పేరు గల డ్రైవర్ ఉండేవాడు. నెల్లూరు కుర్రాడు. నాదగ్గరకి వచ్చేసరికి అతనికి ఇరవై ఏళ్లు ఉంటాయి. ఒక దశాబ్దం పాటు నాదగ్గర ఉన్నాడు. ఇంట్లో మనిషి లా మసలేవాడు. ఒకసారి పండగ రోజున సరిగ్గా సమయానికి తమలపాకులలోకి వక్కపొడి లేకపోవటంతో మనోహర్‌ని పిలిచి, "చెక్కపొడి తీసుకురా" అని పంపించేను (మా నాన్నగారు వాళ్ళది తూరుపు ఆంధ్ర. ఆ ప్రాంతంలో వక్కపొడిని చెక్కపొడి అనటం అలవాటు). ఒక అరగంట తరవాత ఉత్త చేతులతో తిరిగివచ్చాడు మా మనోహర్. అదేమిటని అడిగితే " ఇవాళ పండగ కదండీ ! ప్లయ్ వుడ్, ఫర్నిచర్ షాపులు అన్నీ మూసివున్నాయి" అన్నాడు. అప్పుడు నాబుర్రలో వెలిగింది చెక్క పొడి అంటే మా మనోహర్ వుడ్ పౌడర్ అనుకున్నాడని!

* * *

నా దృష్టిలో– నవ్వు కొన్ని సందర్భాలలో అపహాసానికి దారి తీయవచ్చును కానీ హాస్యం ఎల్లప్పుడూ అందరినీ మనస్ఫూర్తిగా నవ్విస్తుంది. అందుకేనేమో నవ్వు నాలుగు విధాల చేటు అన్నారు. సహజంగా, అప్రయత్నంగా జీవితంలో కొన్ని సంఘటనల వల్ల, సన్నివేశాల వల్ల, మనుష్యుల ప్రవర్తనల వల్ల లేదా ఈ అన్నిటి కలయిక వల్ల ఉద్భవించే హాస్యం అందరినీ అన్నివేళలా సున్నితంగా అలరిస్తుంది. అందుకే మన తెలుగు సాహిత్యంలో కన్యాశుల్కం, బారిస్టర్ పార్వతీశం, గణపతి, అత్తగారి కథలు వంటి రచనలు, భమిడిపాటి కామేశ్వరరావు, ముళ్ళపూడి వేంకట రమణ లాంటి రచయితలు, జంధ్యాల వంటి సినీ రచయిత,దర్శకుల పేర్లు ఇప్పటికీ హాస్యానికి ప్రతీకలుగా చెప్పుకుంటాం. "Literature is the criticism of life" (జీవితాన్ని విశ్లేషిస్తే అది సాహిత్యం అవుతుంది) అన్నాడు Mathew Arnold. నవరసాలు మేళవించిన జీవితంలో హాస్యం కూడా ఒక భాగం. అది సహజంగా వున్నప్పుడే నవ్వుతో పాటు ఆహ్లాదాన్ని కలిగిస్తుంది.

– బి.యస్.వి. పార్థసారథి

శ్రీ జగద్గురు భారతీతీర్థ మహాస్వామి చరణుల ఉపదేశము

అహంకారాన్ని దరిచేరనీయరాదు



మనిషికి గర్వం రావటానికి అనేక కారణాలు సంపదో, పాండిత్యమో, అధికారమో ఏదైనా కావచ్చు. ఒకటి ఉంటేనే గర్వం కొందరికి. మరి అన్నీ కలిస్తే ఇంక చెప్పాలా.

కాని ఈ గర్వమే ముఖ్యమైన శత్రువని మనం గ్రహించాలి. ఈ గర్వం కల మనిషి తప్పుడు పనులెన్నయినా చేస్తాడు. తనను ఎవరూ అడ్డుకోలేరు అనే భ్రమలో ఉండవచ్చు. తన దుష్కర్మల ఫలితాన్ని అతను తప్పకుండా అనుభవిస్తాడు. అందుకని ఈ గర్వాన్ని వదులుకోవాలి. శ్రీశంకరభగవత్పాదులు ఇలా అన్నారు:

"మా కురు ధనజన యౌవనగర్వం హరతి నిమేషాత్ కాలః సర్వమ్"

ధనం, యౌవనం, పాండిత్యము ఇవన్నీ నశ్వరాలు. ఇవి ఏవీ శాశ్వతం కావు. కాలం అన్నిటినీ నిమిషంలో హరిస్తుంది. అందుకని ఎవరూ గర్వించరాదు. శ్రీశంకర భగవత్పాదులు, మొదలగు యతీశ్వరులు ఎంతటి పండితులైనా ఏ మాత్రం గర్వానికి లోనుకాలేదు. అందువల్లనే వారు మహాపురుషులుగా కీర్తింపబడ్డారు.

అందుకని మనిషి కంఠంలో ముల్లువలె, ప్రవేశించిన అహంకారమనే శత్రువును విజ్ఞానమనే ఖడ్గంతో పెకిలించి ఆత్మ సామ్రాజ్య సుఖాన్ని పొందాలి.

"తస్మాదహంకారమిమం స్వశత్రుం
భోక్తుర్గలే కంటకవత్ ప్రతీతమ్।
విచ్ఛిద్య విజ్ఞానమహాసినా స్ఫుటం
భుంక్ష్వాత్మసామ్రాజ్య సుఖం యథేష్టమ్ ॥

SRI RAJARAJESWARI JEWELLERY

The Oldest Jewellery Shop in Pondy Bazaar

81, Pondy Bazar, T. Nagar, Chennai - 600 017.
Phones : 28152387, 28154653

The Purest Treasurer Mortal Times Afford is Spotless Reputation

పరమార్ధ కథలు

శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశనందగిరి స్వాముల వారు

ఏకత్వానుభూతి

పూర్వకాలమున ఒక గురువుండెడివాడు. అతనికొక శిష్యుడుండెను. గురువున కాతడు సేవాశుశ్రూషలు గావించుచుండెను. ఇట్లుండ కొంతకాలమున కా గురువుయొద్ద మరియొక శిష్యుడు వచ్చి చేరెను. ఇరువురును భక్తితో గురువును సేవించుచుండిరి. ఒకనాడు మధ్యాహ్న సమయమున గురువు దూరప్రదేశమునుండి తిరిగి వచ్చి బడలికచే చాపపై ఒకింతసేపు విశ్రమించెను. పరుండబోవునప్పుడు తన మొదటి శిష్యుని పిలిచి 'ఒరే! నాయనా! కాళ్ళు నొప్పిగా నున్నవి. కొంచెము సేపు ఒత్తరా!' యని ఆదేశించెను. అతడట్లే గురువును సేవించుటకు వచ్చుచుండగా, ఇంతలో రెండవ శిష్యుడు ఒక ఆక్షేపణ (Point of Order) తెచ్చెను. అతడు గురువుతో "మహాత్మా! ఇతడు పాతవాడు. చాలాకాలము నుండియు తమ సేవ చేయుచున్నాడు. తత్ఫలితముగా ఇప్పటికే బండెడు పుణ్యమును మూటకట్టి వేసెను. నేనింతవరకు గురుసేవాలభ్యమగు రవ్వంత పుణ్యమును కూడా నోచుకొన లేదు. ఉన్న కాస్త పుణ్యమును, ఇరువురును పంచుకొనవలెనే కాని అంతయు అతని పాలిటనే పడుట న్యాయవిదూరము. కాబట్టి నేటికతని నిలిపివైచి నాకే ఈ అవకాశము నిప్పించ వేడెద!' అని ప్రార్థించెను.

మొదటి శిష్యుడు ఏమియు తక్కువ తినిన వాడు కాదు. అతడు వెంటనే ఉగ్రుడై "స్వామీ! గురువర్యా! అతని వాక్యములను వినకుడు. క్రొత్తగా వచ్చెను కనుక కాళ్ళు పిసుకుట అతనికి సరిగా తెలియదు. అనవసరంగా తమరు బాధకు గురియగుదురు. ఏ ఉద్యోగమునందైనను అనుభవమునకే ఎక్కువ ప్రాధాన్య మొసంగుట లోక ధర్మము. తమకు తెలియనిది ఏమున్నది?" యని చెప్పి యూరకుండెను. ఈ ప్రకారముగా ఆ ఇద్దరు శిష్యులు గురువునకు లేనిపోని ఒక సమస్యను తెచ్చిపెట్టిరి. మాయాబంధము భేదించి వేయుట గూడ ఆ గురువునకు సులభమనిపించెను గాని ఈ పరమానందయ్య శిష్యులిరువురికిని రాజీ చేయుట మాత్రము మహాదుస్తర మనిపించెను.

ఏమి చేయుటకు తోచక తుదకు మధ్యేమార్గ మవలంబించ నిశ్చయించి, ఇరువురిని దగ్గరకు పిలిచి 'ఒరే! నాయనలారా! తగవులాడు కొనకుడు. భగవంతుడు నాకు రెండు కాళ్ళు ఇచ్చియున్నాడు. కనుక చెరియొక కాలు పంచుకొని సేవించుడు. ఈ పీడకు ఇదియే విరుగుడు' అని చెప్పి పరుండెను.

శిష్యులిద్దరున్నూ భేష్ భేష్ అని సంతోషించి అట్లే చెరియొక కాలు పంచుకొని సేవించుచుండిరి. వైమనస్యము అసలు ఉండరాదు. ఉండినచో అది యేదియో ఒకరూపమున బయటకు వెడల గ్రక్కబడుచునే యుండును. ఈ శిష్యుల విషయమట్లే అయినది. పొరపాటున ఒకరు పిసుకుచుండిన కాలు మరియొక దానికి కొద్దిగ తగిలెను. అవతలివాడు కోపగించి, "ఏమిరా! ఒళ్ళు దగ్గర పెట్టుకొని పనిచెయ్యి" అని మందలించి, ప్రతీకారచర్యగా తాను ఒత్తుచుండిన గురువు కాలు ఎత్తి అమాంతముగ అవతలిదానిమీద విసరివేసెను. వాడున్ను రుద్రాకారము ధరించి, "ఒరే! నాకాలిని కొట్టెదవా? నీకాలు పనిపట్టెదను చూడు" అని రోషారుణిత నేత్రుడై దగ్గఱనేయున్న గురువుగారి కమండలమును తీసికొని దానితో అవతలి కాలిమీద బలవంతముగ కొట్టెను. వాడున్ను ప్రళయాకృతి వహించి గురువుగారి యోగదండము తీసికొని ఇవతలి కాలిని చావమోదెను. ఈ 'గలాటా' అంతయు చూచి గురువుగారు నిద్రలేచిరి. శిష్యుడు శిష్యుడు పోట్లాడుకొని, గురువుకాళ్ళు చప్పుగా నాశనము చేసిరి. గురువు బాధతో "ఏమిట్రా ఈ గల్లంతు!" అని అఱవగా ఆ శిష్యులిరువురును, మహాత్మా! తాము పరుండుడు! ఇది మా అంతరంగ వ్యవహారము (domestic affair) ఇదేదో తేలవలె. వాడి కాలు గొప్పో, నా కాలు గొప్పో, అని పలికిరి. అంతట గురువు "ఒరే నీకాలు, వాడి కాలు ఏమిట్రా? ఆ రెండును నా కాళ్ళే కదరా! ఎంత తెలివి తక్కువ వారురా మీరు?" అని తిట్టి ఇరువురిని దూరముగా పంపివేసెను.

అట్లే ప్రపంచమందలి జీవరాసులందఱును పరమాత్మయొక్క అవయవములు వేఱువేఱుగా కనిపించినను, "అవయవ" దృష్ట్యా వాటియన్నింటి యందును ఏకత్వమే కలదు. దృష్టాంతమందలి గురువు గారి ఒకకాలు మరియొక కాలిని దన్నుట ఎంత హాస్యాస్పదమయిన విషయమో, ఒక ప్రాణి మరియొక ప్రాణితో పోట్లాడుట, అతనిని ద్వేషించుట, హింసించుట అంత హాస్యాస్పదమే యగును.

నీతి:– ప్రపంచమంతయు భగవత్స్వరూపమని యెంచి సర్వుల యెడ ప్రేమ, దయ కలిగియుండుము. ఎవరినీ ద్వేషింపరాదు.

శ్రీ రామ నామ వరానే...

(అన్నియూ ఆట వెలదులే.....)

1. శ్రీకరుడవు నీకె సేసెద కైమోడ్పు
   శతక మొకటి యల్ల సంతసమున
   సాహసమ్మె నాది సాదరముగ జూసి
   కౌసలేయ మమ్ము గావుమయ్య...!

2. ఆది కవి రచనకు నాధ్యాత్మ గ్రంథమై
   తోడు నిలచె మాకు నీడగాను
   వ్యాస కృత మనంగ వందనీయమె యది
   కౌసలేయ మమ్ము గావుమయ్య...!

3. రామ నీదు కథయె రకరకములుగాను
   చదివి చూడ నేవి సబబుగాను
   కానవచ్చునన్న కాద యది నీ వాసి
   కౌసలేయ మమ్ము గావుమయ్య...!

4. వందనీయ మెపుడు వాల్మీకి గ్రంథము
   యోగి గనుక యతడె యుక్తముగను
   నీదు చరిత మిచ్చె నింపగ మా హృది
   కౌసలేయ! మమ్ము గావుమయ్య !!

5. పాయసమ్ముతోటి పరుగున వస్తివి
   పంక్తి జనుల బ్రోచ పావనుడవె
   మాపు సేయ గలవు మా దుర్మతల నింక
   కౌసలేయ! మమ్ము గావుమయ్య !!

- పి.వి.ఆర్. గోపినాథ్

భగవంతునికి భక్తునికి
అనుసంధానమైనది
అంబికా దర్బార్‌బత్తి

మంచి గుమ్మడి

నటుడన్న తరువాత అన్ని పాత్రలను పోషించి మెప్పించాలి. తండ్రిగా, రైతుగా, జమీందారుగా, తేనెపూసిన కత్తిలాంటి విలన్‌గా... మరెన్నో విభిన్నమైన పాత్రలను పోషించి తెలుగు వారి మన్ననలను పొందిన మంచి గుమ్మడిపండు లాంటి నటుడు శ్రీ గుమ్మడి వెంకటేశ్వరరావుగారు. అన్ని పాత్రలకూ న్యాయం చేకూర్చినప్పటికీ ప్రేక్షకులు మాత్రం వారిని సాత్వికమైన పాత్రల్లోనే చూడటానికి ఇష్టపడేవారు. బహుశా, ఆ పాత్రలు ఆయన స్వభావానికి దగ్గరగా ఉండటం వల్లనేమో! తెలుగుభాషను ఎంత మధురంగా పలకాలో ఈ తరం నటీనటులు నేర్చుకోవాలంటే గుమ్మడిగారి సిన్నిమాలన్నిటినీ చూసి తీరవలసిందే! సినిమా రంగంలో, గుమ్మడిగా ప్రసిద్ధిచెందిన వీరు, అయిదు దశాబ్దాల పాటు తెలుగుచలనచిత్ర రంగంలో విభిన్న పాత్రలను పోషించి, తన ప్రత్యేకతను చాటుకున్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేత, రఘుపతి వెంకయ్య అవార్డును స్వీకరించారు. దాదాపుగా 500లకు పైగా సినిమాలలో నటించారు. చలనచిత్ర రంగానికి వీరు చేసిన సేవలను గుర్తించి శ్రీ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం వారు, ఈ మహానటునికి 'కళాప్రపూర్ణ' అనే బిరుదును ఇచ్చి సత్కరించారు. పౌరాణిక, సాంఘీక, జానపద, చారిత్రిక పాత్రలన్నిటిలోనూ విశేష ప్రతిభను కనబరచారు. తండ్రిగా, అన్నగా, తాతగా... వేషమేదైనా దానిని పండించటం ఆయనకు కరతలామలకం. తెలుగువారి పంచకట్టులోని హుందాతనాన్ని చూపించటమే కాకుండా, 'అచ్చమైన తెలుగువాడంటే ఇలానే ఉండాలి' అనిపించేటట్లు వుండేవారు. ఎన్.టి.ఆర్‌తో నటించిన, తోడుదొంగలు, మహామంత్రి తిమ్మరసు, సినిమాలు గుమ్మడికి నటుడిగా మంచి పేరు తెచ్చిపెట్టాయి. 'తోడుదొంగలు'కు రాష్ట్రపతి బహుమతి రాగా 'మహామంత్రి తిమ్మరసు'లో ఆయన నటనకు జాతీయ స్థాయిలో ఉత్తమ సహాయనటుడిగా బహుమతి వచ్చింది. 'మాయాబజార్, మాయింటి మహాలక్ష్మి, కులదైవం, కుల గోత్రాలు, జ్యోతి, నెలవంక, మరోమలుపు, ఏకలవ్య, ఈ చరిత్ర ఏ సిరాతో, గాజు బొమ్మలు, పెళ్ళిపుస్తకం' గుమ్మడికి పేరు తెచ్చిపెట్టిన సినిమాలలో కొన్ని మాత్రమే!

తెలుగు విశ్వవిద్యాలయంవారు మహామంత్రి తిమ్మరుసు లోని ఆయన కనబరచిన విశేష నటనా ప్రాభవానికి గుర్తింపుగా డాక్టరేటుతో సన్మానించింది. 1982లో మరో మలుపులోని నటనకు ఉత్తమ సహాయనటుడిగా రాష్ట్రప్రభుత్వం చేత నంది అవార్డును బహుమతిగా పొందారు. జాతీయ సినిమా బహుమతులకు న్యాయనిర్ణేతగా మూడు సార్లు, రెండుసార్లు నందీ అవార్డుల న్యాయనిర్ణేత సంఘానికి అధ్యక్షునిగా పనిచేశారు. ఎన్‌టిఆర్ అవార్డు, రఘుపతి వెంకయ్య అవార్డుల సంఘాలకు కూడా న్యాయనిర్ణేతగా వ్యవహరించారు. ఆయన తన జీవితచరిత్రను, తీపిగుర్తులు, చేదుజ్ఞాపకాలు అనే పేరుతో రచించారు. 1995లో ఆరోగ్యం సరిగాలేక, గొంతు సరిగా పనిచేయనప్పుడు, ఇతరుల గొంతును అరువు తీసుకోవటం ఇష్టంలేక నటించటం మానుకున్నారు. మరల శ్రీ జగద్గురు కాశీనాయన చరిత్ర (2008)లో ఆయన వయసు, గొంతు, ఆ పాత్రకు సరిపోవటం వల్ల నటించారు. అదే ఆయన ఆఖరి సినిమా. గుమ్మడి స్వగ్రామం తెనాలి దగ్గర రావికంపాడు అనే ఒక చిన్న గ్రామం. ఈయన ఒక సామాన్య రైతు కుటుంబంలో 09-07-1927న బసవయ్య, బుచ్చమ్మ దంపతులకు జన్మించారు. గుమ్మడి గారికి ముగ్గురు తమ్ముళ్ళు, ఒక చెల్లెలు ఉన్నారు. గుమ్మడి గారి బాల్యమంతా గారాబంగా గడిచింది. ఉమ్మడి కుటుంబ వాతావరణంలో పెరిగిన గుమ్మడి జీవితం ఆయన నటజీవితంలో ప్రతిఫలించి సాత్విక పాత్రలలో ఆయన జీవించటానికి సహకరించింది. తన తండ్రి బసవయ్య, పెదనాన్న నారయ్య గార్లు రక్తసంబంధంతోనే కాకుండా స్నేహానుబంధంతో మెలిగేవారని గుమ్మడి మాటల్లో తెలుస్తుంది. గుమ్మడి ప్రారంభ విద్య నుండి స్కూలు ఫైనల్ వరకు స్వంత వూరు అయిన రావికంపాడుకు మూడు కిలోమీటర్ల దూరంలో వున్న కొల్లూరు ఉన్నత పాఠశాలలో జరిగింది. అక్కడనే ఆయన 'ఎస్ఎస్ఎల్‌సి' దాకా చదివారు. ఆయన వివాహం, 1944లో పెద్దల సమక్షంలో నాయనమ్మకు అమ్మమ్మ అయిన 103 సంవత్సరాల వృద్ధురాలు, నాయనమ్మ, అమ్మమ్మ వంటి పెద్దల ఆశీర్వచనంతో జరిగింది. గుమ్మడిని తన కుమారుడిగా భావించిన ఆయన అత్తగారు, ఆయన విద్యాభిలాషను గమనించి, వివాహానంతరం గుంటూరులోని హిందూ కాలేజీలో ఉన్నత విద్యాభ్యాసానికి సహకరించింది. అత్తగారి సహకారంతో గుంటూరు హిందూ కాలేజీలో ఇంటర్ వరకు (1944-46) చదువు సాగింది. ఆయన సహవిద్యార్థి, ప్రముఖ చలనచిత్ర నటి సీనియర్ శ్రీరంజని కుమారుడైన యమ్.మల్లికార్జునరావు సాహచర్యంతో ఆయనలో కలిగిన విపరీతమైన సినిమా వ్యామోహం వలన, ఇంటర్ పరీక్షల్లో అపజయం పాలైనారు. ఈ అపజయం వలన, అవకాశం కోసం చూస్తున్న పెద్దలు వారిని వెనుకకు పిలిపించి వ్యవసాయపు పనులను అప్పగించారు. అంతటితో ఆయన విద్యార్థి జీవితం ఒక ముగింపుకు వచ్చింది. గుమ్మడిగారి రంగస్థల జీవితం యాదృచ్ఛికంగా ప్రారంభం అయింది. ఆయన ఎనిమిదవ తరగతి చదువుతున్న రోజులలోనే ఉపాధ్యాయుని ఆదేశంతో పేదరైతు అనే నాటకంలో వయోవృద్ధుడైన రైతు పాత్రను పోషించారు. ఆ నాటకంలో ఆయన నటనకు మంచి గుర్తింపు లభించింది. అలా ఆయన రంగస్థల ప్రవేశం జరిగింది. ఒకసారి ఆయన వీరాభిమన్యు నాటకం చదవటం తటస్థించింది. ఆ కాలంలో పద్య నాటకాలకు ఎక్కువ ఆదరణ వుండేది. వీరాభిమన్యు నాటకంలో వచనం ఎక్కువగా వుండటం చేత, ఆ నాటకం వీరిని బాగా ఆకర్షించింది. కొంతమంది స్నేహితులను కూర్చుకొని స్వంత ఖర్చుతో ఆ నాటకాన్ని రంగస్థలానికి ఎక్కించి, అందులో తాను దుర్యోధనుడి పాత్రను అభినయించారు. ఆ నాటకానికి లభించిన ప్రాచుర్యం ప్రముఖ దుర్యోధన పాత్రధారి శ్రీ మాధవపెద్ది వెంకటరామయ్య గారి దాకా చేరింది. ఒకసారి ఆయనను, శ్రీ మాధవపెద్ది వెంకటరామయ్య గారే స్వయంగా పిలిచి, దుర్యోధన పాత్రను మరింత రసవత్తరంగా నటించటం గురించి వివరించి ఆశ్చర్యపరిచారు. ఆ తరువాత వారిరువురికీ పెరిగిన పరిచయం, శ్రీ మాధవపెద్ది వెంకటరామయ్య గారి నాటకంలో గుమ్మడిగారి దుర్యోధన పాత్ర, మాధవపెద్ది వారు కర్ణ పాత్రను నటించేవరకు వెళ్ళింది. ఆ నాటకంలో నటించిన అనంతరం, ఆయన గుమ్మడితో, "నాటకంలో బాగా నటించావు. కానీ, నాటకంలో నటించటానికి కావలసిన ఆంగికాభినయం కంటే సాత్వికాభినయం నీలో ఎక్కువగా ఉంది. సినిమాలలో ప్రయత్నిస్తే, అభివృద్ధిలోకి వస్తావు" అని సలహా ఇచ్చారు. సినిమాల మీద గుమ్మడిగారికి ఉన్న వ్యామోహం, వెంకటరామయ్యగారి సలహాతో మరీ ఎక్కువైంది. ఆ తరువాత గుమ్మడి మనసు సినిమాలవైపు మళ్ళింది. గుమ్మడి హైస్కూల్‌లో చదువుకునే రోజుల్లో ఆయన తెలుగు మాస్టర్ గారైన శ్రీ జాస్తి శ్రీ రాములుగారి వల్ల, ఆయనకు తెలుగు భాషపై మక్కువ పెరిగింది. ఆ కాలంలో ఆయన తెనాలిలో, ఆంధ్రా రేడియోస్ అనే వ్యాపార సంస్థను ప్రారంభించారు. వ్యాపారం పెట్టినా, నటనా వాసనలు ఆయనను వదలని కారణంగా, ఆయన షాపు నాటక సమాజానికి కార్యాలయంగా మారింది. వ్యాపారంలో నష్టాలను

చవిచూసారు. కుటుంబం ఇద్దరు పిల్లలవరకు పెరిగింది. తెనాలిలో ఆయనను కలిసిన ఆయన సహవిద్యార్థి, మిత్రుడు మల్లికార్జునరావు సినిమాలలో నటించమని సలహాను ఇచ్చాడు. గుమ్మడి, మల్లికార్జునరావుగారితో కలసి తొలిసారి మద్రాసుకు ప్రయాణమయ్యారు. మద్రాసులో శ్రీ కే.వీ.రెడ్డి, హెచ్.యమ్.రెడ్డి వంటివారిని కలిసి అవకాశం కోసం వారిని అర్థించి చూసారు. వారి వద్ద నుండి సుముఖమైన సమాధానం రాకపోవటం వల్ల తిరిగి తెనాలికి వెళ్లి యథావిధంగా జీవితం సాగించారు. శ్రీ డీ.యల్.నారాయణగారికి గుమ్మడి గారి నటన అంటే ఎంతో ఇష్టం. ఆయనకు ఎప్పుడు సినిమాలలో అవకాశం కల్పించాలా అని తగిన సమయం కోసం చూసేవారు. గుమ్మడిగారి ఫోటోలు ఎప్పుడూ ఆయన జేబులోనే ఉండేవి. తమిళనాడు టాకీస్ అధినేత సౌందర్‌రాజన్ అయ్యంగారు తాను తెలుగులో తీయబోయే సినిమాకు కొత్తవాళ్ళు కావాలన్న వెంటనే శ్రీ. డీ.యల్.నారాయణగారు ఆయన జేబులో ఉన్న గుమ్మడిగారి ఫోటోలను చూపించారు. వాటిని చూసిన సౌందర్‌రాజన్ అయ్యంగారు గుమ్మడిగారికి అవకాశం ఇవ్వటంపై మొగ్గు చూపటంతో, గుమ్మడిగారి సినిమా జీవితం ఆరంభమైంది. ఆ విషయం గుమ్మడి గారికి తంతి ద్వారా తెలియజేసి, వెయ్యిరూపాయల పారితోషకం కూడా ఇవ్వటానికి నిర్ణయం జరిగింది. ఆ చిత్రం పేరు, అదృష్టదీపుడు(1950). దానిలో గుమ్మడిగారి పాత్ర ముక్కామల గారికి అసిస్టెంట్. రెండవ సినిమా నవ్వితే నవరత్నాలు. మూడవ సినిమా పేరంటాలు, నాలుగవ సినిమా ప్రతిజ్ఞ. వీటన్నిటిలో చిన్న చిన్న పాత్రలు మాత్రమే లభించాయి. తదుపరి అవకాశాలు లేవని తిరిగి వెళ్లాలని భావించిన సమయంలో, ఎన్‌టిఆర్‌తో కలిగిన పరిచయంతో, ఎన్‌టిఆర్ గారు గుమ్మడిని వెళ్ళవద్దని చెప్పారు. తన స్వంత చిత్రం, పిచ్చిపుల్లయ్యలో మంచి వేషం ఇచ్చారు. అది ప్రతినాయక పాత్ర. దానితో గుమ్మడి సినీజీవితం మరో మలుపు తిరిగింది. ఎన్.టి.రామారావుగారు వారి తదుపరి చిత్రమైన, తోడుదొంగలులో కూడా గుమ్మడి గారికి మంచిపాత్రను ఇచ్చారు. ఆ సినిమా ఆర్థికంగా విజయం సాధించకపోయినా, ఉత్తమ ప్రాంతీయ చిత్రంగా అవార్డును పొందింది. అలా సాగుతున్న ఆయన సినీ జీవిత ప్రస్థానంలో, మరో మంచి మలుపు 'అర్థాంగి' సినిమా. అర్థాంగి సినిమాలో ఆయన వేషం జమీందారు మరియు శాంతకుమారి గారి భర్త. ఆ సినిమాలో, దర్శకుడు పుల్లయ్యగారు ఆయనకు ఆ వేషానికి ఎన్నిక చేసే సమయంలో శాంతకుమారిగారు అభ్యంతరం చెప్పారు. ఆయన తన కన్నా చిన్న వాడని, తన భర్త పాత్రకు నప్పడని ఆవిడ అభ్యంతరం. పుల్లయ్యగారు, ఎవరుచెప్పినా వినకుండా గుమ్మడిగారినే ఆ పాత్రకు తీసుకున్నారు. ఆ సినిమా అఖండ విజయాన్ని చవిచూసింది. అక్కడి నుండి ఆయన చివరివరకూ నటయాత్రలో వెనక్కు తిరిగి చూసుకోనవసరం లేకపోయింది. చిన్న వయసులోనే కారక్టర్ నటుడయ్యారు. నిజానికి, రామారావు, నాగేశ్వరరావుల కన్నా చిన్నవాడైనప్పటికీ, అనేక సినిమాలలో వారికి తండ్రిగా, మామగా నటించారు. నటించిన ప్రతి పాత్రలో ఒదిగిపోవటం ఆయన ప్రత్యేకత. అత్యంత వైరుధ్యమైన వసిష్ఠ, విశ్వామిత్ర లాంటి పాత్రలను నటించి ప్రశంసలు పొందారు. కర్ణుడిగా, ధర్మరాజుగా, సత్రాజిత్తుగా, బలరాముడిగా, భృగుమహర్షిగా, భీష్ముడిగా పౌరాణిక పాత్రలలో ఆయన కనబరచిన నటన మరువలేనిది. సాంఘిక చిత్రాలలో సాత్విక పాత్రలతో పాటు ప్రతినాయకునిగా (నమ్మినబంటు, లక్షాధికారి, ఇద్దరుమిత్రులు మొదలైనవి) ఆయన కనబరచిన నటన శ్లాఘనీయం. రామారావుగారితో ఆయనకు కుటుంబ సాన్నిహిత్యం కూడా పెరిగింది. ఆయన సలహామేరకు, కుటుంబాన్ని మద్రాసుకు తీసుకొని వచ్చారు. గుమ్మడిగారికి అయిదుగురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. బాధ్యతాయుతమైన తండ్రిగా వ్యవహరించారు. కుటుంబ శ్రేయస్సు దృష్ట్యా చిత్రాల నిర్మాణానికి దూరంగా ఉండిపోయారు. మొదటి సినిమాలో నటించే సమయంలో నాగయ్యగారి కార్యాలయంలో ఒక రూములో ఉండే గుమ్మడి తరువాత తన మకాంను ఒక హోటల్‌కు మార్చారు. ఆ సమయంలో టిఎన్‌టి ఆఫీసుకు ఎదురుగా వున్న హోటల్ రూములో టీ.వీ.రాజు గారితో కలసివున్న రామారావుగారితో ఏర్పడిన పరిచయం సన్నిహితంగా మారి, ఆ పరిచయం గుమ్మడిగారి నటజీవితానికి పునాది అయింది. అర్థాంగి సినిమాలో ఆయన భార్యగా నటించిన శాంతకుమారిగారు, ఆయనకన్నా ఎనిమిది ఏళ్ళు, ఆయన కుమారుడిగా నటించిన నాగేశ్వరరావుగారు మూడు ఏళ్ళు పెద్దవారు. ఆయన చిన్న కుమారుడిగా నటించిన జగ్గయ్యగారు ఒక ఏడాది పెద్ద. సినీ జీవితపు తొలినాళ్ళలో, తీసుకొని వచ్చిన డబ్బులు అయిపోయి, రెండు రోజులు మంచినీటితో సరిపెట్టుకున్నారు. పెళ్ళినాటి ఉంగరాన్ని తాకట్టుపెట్టి, తరువాతి రోజుల్లో దాన్ని విడిపించుకున్నారు. వారి జీవితంలో ఇబ్బందిపడ్డ రోజులివే! మహామంత్రి తిమ్మరుసులో ఎన్.టి.ఆర్. శ్రీకృష్ణదేవరాయల పాత్రను పోషించినా, సినిమాకు గుమ్మడి నటించిన పాత్ర పేరు ఉండటం విశేషం. అలాగే మర్మయోగి సినిమాకు కూడా. ఇవి అరుదైన సంఘనలు.

శ్రీ గుమ్మడి తన స్వీయ చరిత్రను, 'తీపిగుర్తులు–చేదు జ్ఞాపకాలు' అనే పేరు మీద వ్రాసుకున్నారు. ఈ మహానటుడు హైదరాబాద్ లోని కేర్ హాస్పిటల్‌లో 2010న శరీరంలో చాలా అవయవాలు పనిచేయకపోవటం వల్ల మరణించారు. ఆయన చివరిసారిగా, 'మాయాబజార్' (రంగుల్లోకి మార్చినది) ప్రదర్శించినప్పుడు ప్రజల మధ్య గడిపారు. "ఆ గొప్ప సినిమాను రంగుల్లో చూడటానికేమో, నేను ఇంత దీర్ఘకాలం బతికి ఉన్నాను" అని తన సంతోషాన్ని వ్యక్తం చేసారు. ఈ మహానటుడిని గురించి శ్రీ గొల్లపూడి మారుతీరావుగారు "గుమ్మడిగారు విపరీతమైన ఆవేశి, కోపిష్ఠి. ఆయనకి నచ్చిన విషయాన్ని నెత్తిన వేసుకుని పదిమందికీ ఎలా పంచుతారో, నచ్చని విషయాన్ని కుండ బద్దలు కొట్టేవరకూ నిద్రపోరు. ఈటీవీ ఛానల్‌కో, దినపత్రికకో సంబంధించిన ఏదో విషయానికి కోపోద్రిక్తులై ఫోనెత్తి సరాసరి రామోజీరావు గారితోనే చెప్పారట. నచ్చని విషయంలో దాపరికం లేదు. నిజాయితీ లోపం లేదు. ఓ గొప్ప నటుడి ఆవేశం, కోపం అతని నటనలో తప్పక తర్జుమా అవుతుంది. ద్రోణుడూ, బలరాముడూ ఇందుకు ఉదాహరణలు. ఆ కోపం గుమ్మడిగారి నటన కాదు. ఆయన ఆస్తి ఆయన చేసే పాత్రల్లో రాజీ లేదు. మధ్యేమార్గం లేదు. ద్రోణుడయినా, భానోజీ అయినా ఆయన కళ్ళముందు రూపుకట్టాలి. తర్వాతనే మన కళ్ళముందుకు ఆయన తెచ్చేది. నేను రాసిన ఒకానొక సినిమాలో నాకిష్టమయిన ఒక పాత్రకి ఆయన్ని అనుకున్నాం. నాకు ముందు రోజు పొల్లాచిలో షూటింగ్ వేషం వేసుకుని లొకేషన్‌కి వచ్చారట. బడిపంతులు వేషం. తన అవగాహనని అర్థం చేసుకోని డైరెక్టర్‌ని ఒప్పించాలని ప్రయత్నించి, సాధ్యంకాక, విసిగి, విగ్గుతీసేసి వెళ్ళిపోయారు. మరునాడు నాకు చెప్పారు. ఆయన్ని ఆ పాత్రకి నష్టపోయినందుకు బాధపడినా, నటుడిగా, రచయితగా ఆయన నిజాయితీకి గర్వపడ్డాను.

గర్వంగా జీవితాన్ని తన షరతులతోనే నడిపారు. తెరమీద కన్నీళ్ళు ఆయన బాంక్ అకౌంట్. జీవితంలో వాటిని స్వయంగా రెండుసార్లే చూసాను. వారి శ్రీమతి కన్నుమూసినప్పుడు. ప్రాణపదమయిన కూతురు వెళ్ళిపోయినప్పుడు. దేనితోనూ రాజీపడని నిరంకుశుడు, గర్విష్ఠి, కోపిష్టిని అనారోగ్యం ఆఖరిరోజుల్లో లొంగదీసింది. అద్భుతమైన వాచకంతోనే అశేష ప్రజానీకాన్ని అలరించిన ఆయన గొంతు సహకరించకపోవడం ఆయన్ని కృంగదీసింది. ఓ గొప్ప నటుడికి విధి చేసిన భయంకరమైన దోపిడీ అది. మొదటిసారిగా గుండె కలుక్కుమంది. ముందు ముందు కంప్యూటర్ యుగం వినోదాన్ని వింతగా అలంకరిస్తుంది. నేటితరం సంప్రదాయానికి అప్పుడే దూరంగా జరిగిపోతోంది. హారీపోటర్ చదివే పసివాడికి హరిశ్చంద్రుడి వైభవం తెలుసుకునే ఆస్కారం పోతోంది. డిజిటల్ ధర్మమంటూ ఒక గొప్ప ఇతివృత్తం ఈ దేశంలో చచ్చిపోయి చాలా రోజులయింది. ఆ ఇతివృత్తాన్ని ఒక జీవితకాలం తన సొత్తుగా, మాధవపెద్ది, అద్దంకి, పులిపాటివారికి వారసుడుగా ఓ తరాన్ని ప్రభావితం చేసిన ఆఖరి యోధుడి నిష్క్రమణాన్ని తలపండిన అభిమానులే తలచుకుని కంటతడిపెట్టే రోజులొచ్చేసాయి. అయితే గుమ్మడివంటి మహానటుల చరిత్రని పంచరంగుల కలగా భద్రపరిచే ప్రయత్నాలు అదృష్టవశాత్తూ ఈ దేశంలో ప్రారంభమయ్యాయి. నిన్నటి "మాయాబజార్" అందుకు మంచి శకునం. ముందు తరాలకి తెర అంతా పరచుకున్న ఇలాంటి మహానటుల విశ్వరూపం– ఆనందాన్నీ, ఆశ్చర్యాన్నీ, గర్వాన్నీ, ఈ కళని అపురూపమయిన వారసత్వ వైభవాన్ని సంతరించక మానదు.

– టీవీయస్. శాస్త్రి

Lovely Stay at Holy Tirupathi *The Gateway of Lord Balaji*

HOTEL MAYURA

204, 209, T.P. Area, Tirupati - 517 501 (A.P.)
(Opposite Bus Station)
Phone : 0877-2225925, 2225251, Fax : 0877-2225911
e-mail : mayurahotels@yahoo.co.in, Grams :

స్వాతంత్ర్య శంఖారావం పూరించిన వీరమూర్తి
మహా రాణాప్రతాప్

16వ శతాబ్దం భారతదేశానికి ఒక పీడ కల. టర్కీ దేశస్థుడైన బాబర్ భారతదేశం మీదికి దాడిచేసి ఉత్తర భారతదేశంలో ఆఫ్ఘనిస్తాన్ నుంచి బీహార్ వరకూ, హిమాలయాల నుండి గ్వాలియర్ వరకు తన రాజ్యాన్ని విస్తరించాడు. అతని కుమారుడు హుమాయూన్ పర్షియా సామ్రాట్టు సహాయంతో కాలు నిలువ దొక్కుకొని, అధికారాన్ని నిలుపుకొన్నా హఠాన్మరణంతో ఎక్కువకాలం తన ప్రభుత్వాన్ని నిలుపుకోలేకపోయాడు. అతని తర్వాత అక్బరు 1557లో ఢిల్లీ సింహాసనాన్ని చేజిక్కించుకున్నాడు.

అప్పటికే ఉత్తర భారతంలో క్షాత్రశక్తి అలసిపోయింది. హిందూ రాజులలో ఐక్యత నశించింది. భారత చరిత్రలో ఒక అగ్నిగర్భలా జీవించిన రాజపుత్ర స్థానం ఆత్మవిశ్వాసాన్ని కోల్పోయింది. 7వ శతాబ్దం నుండి ఎడతెగకుండా సాగిన విదేశ దండయాత్రల పరంపరను ఎదుర్కొంటూ యుద్ధజ్వాలల్లో పురుషులు ఆత్మాహుతులను కలుస్తుంటే, స్త్రీలు పరాయి పిశాచ కామానికి బలికాకుండా, స్త్రీ జీవన పావిత్ర్యాన్ని కాపాడుతూ వచ్చారు. కానీ ఈ దీర్ఘ పోరాటం సామాన్యునికి దుస్సాహసమైంది.

జయపూర్ రాజైన బిహారీమల్, అతని కుమారుడు భగవాన్‌దాస్ అక్బరుకు దాసోహమన్నారు. అతని కుమారుడు మాన్‌సింగ్ తన కుమార్తె జోధ్‌బాయిని అక్బరుకిచ్చి వివాహం చేశారు. మిగతా రాజపుత్రులు కూడా క్రమంగా అక్బరు ఆధిపత్యాన్ని స్వీకరిస్తూ వచ్చారు.

అక్బరు చతురుడు. భారతదేశంలో ఆంగ్లేయులు ప్రారంభించిన "విభజించు పాలించు" వ్యూహం అక్బరు విదానంలోంచి నేర్చుకున్నదే అంటారు చరిత్రకారులు. భారతీయ ఆత్మ గౌరవాన్ని నిలబెట్టుకునే అంతశ్శక్తిని, అభిమానాన్ని దెబ్బ తీస్తే ఈ జాతి నిస్తేజమౌతుందని గుర్తించాడు. ఇస్లాం మత ప్రచారానికి రాచబాట ఉదారవాదాన్ని ప్రచారం చేయటమేనని గ్రహించిన అక్బరు రాజపుత్రుల అభిమానాన్ని దెబ్బ తీయడానికే వివాహ సంబంధాలను, ఏకముఖంగా కొనసాగడానికి ప్రోత్స హించాడు.

అక్బరు టర్కీ దేశస్థుడు. ప్రపంచ చరిత్రలో పరమ కిరాతకాలను, అమానుష మానవ సంహారాలను రచించిన చెంఘీజ్‌ఖాన్ తైమూర్ వంశాల వారసుడు. అందుకే ఇతర జాతుల ఇస్లాం రాజులను కూడా అతడు సహించలేదు. ఈ భయానక పరిస్థితిలో జాతి స్వాతంత్ర్యేచ్ఛను, స్వరాజ్య పిపాసను కాపాడవలసిన అవసరం ఒక మహా తపస్సుగా నిలిచింది.

ఇట్టి పరిస్థితిలో రాజపుత్రస్థానంలో శిశోదియా వంశం

మహారాజ బాప్పారావల్ వెలిగించిన ధర్మవీర పతాకానికి మేవాడ-చిత్తోడ్ రాజులు ఆదార స్తంభాలైనారు. వారు క్షాత్రకుల గురువులు, ఆ నేలన పుట్టిన ప్రతి బాలుడూ ఒక అగ్ని గోళం. అక్కడ పుట్టిన ప్రతి బాలికా ఆత్మాభిమాన జ్వాల.

శిశోదియా వీరులకు ప్రాణాలు తృణప్రాయాలు. స్వాతంత్ర్యం కొరకు తరతరాలుగా బలి అయిపోతూ వచ్చారేగాని శత్రువు ముందు తలదించలేదు. చిత్తోడ్ మీద శత్రువుల దాడులు జరిగినప్పుడల్లా, పోరాడినంతసేపు పోరాడి, కోట తలుపులు తెరచి కాషాయ వస్త్రాలతో, కాషాయ ధ్వజాలతో తమ కులదైవమైన "ఏకలింగ" స్వామికి జయకారాలర్పిస్తూ పౌరుష దివ్యకాంతులను వెదజల్లుతూ ప్రళయతాండవంచేసి ప్రానాలర్పించారేగానీ, బానిసత్వాన్ని స్వీకరించలేదు. అలాగే వేలకొలది రాజపుత్రరమణులు "జోహార్" చేసి, స్వయంగా తమకై తాము చితాగ్నిలోపడి, శత్రుపిశాచ కామాన్ని అపహసిస్తూ, అగ్నిగర్భంలో లీనమైనవారేగాని, అవమానానికి గురికాలేదు.

రాజపుత్రులకానాడు త్యాగం అభిమాన మంత్రం. దేశ ధర్మ రక్షణకు ప్రాణాలర్పించడం మహా మహావ్రతం. అలాంటి వీరజాతికి దివ్యకలశం రాణా ప్రతాప్. ప్రతాప సింహుని చరిత్ర ఒక వీర రస మహా కావ్యం. ఆయన జాతి స్వాభిమానానికి స్వాతంత్రేచ్ఛకు, పరమ వీర వ్రతానికి దివ్య పతాకగా జీవించిన ఆదర్శఖని. ఆయన రగిలించిన దివ్య జ్వాలలు, గురుగోవిందుడిగా, విద్యారణ్యులుగా,

శివాజీ ఛత్రపతిగా, ఝాన్సీలక్ష్మీబాయిగా ఆ తరువాతి యుగంలో వెలుగులు క్రుమ్మరించాయి.

అక్బరు మేవాడ్ మీదికి మొదటి దండయాత్ర చేసినప్పుడు, ప్రతాపసింహుని తండ్రి ఉదయసింహుడు మొగల్ సేనల ధాటికాగలేక, ఆరావళీ పర్వతాలలో తలదాచుకొన్నాడు. నాటి సేనాపతులు జయమల్, పత్తాలు చివరిక్షణం వరకు పోరాటం సాగించి వీరస్వర్గాన్ని అలంకరించారు. ఉత్తర భారత స్వాతంత్ర దీపికగా మిగిలిన మేవాడ్ శత్రు దురాక్రమణకు బలి అయిన తరుణంలో ఉదయసింహుని మరణానంతరం ప్రతాపుడు రాజైనాడు.

రాజ్యం లేదు. ధన సంపదలు లేవు. నమ్మిన కొంతమంది వీరయోధులు తప్ప సైన్యం లేదు. నిలువ నీడ కూడా లేని దుర్భర పరిస్థితి. తోటి రాజపుత్రులు విదేశ విధర్మ పరిపాలకుని ముందు తలదించి, అతని పల్లకీకి బోయీలైనారు ప్రతాపసింహుడీ పరిస్థితి నుంచి మేవాడ్ రక్షణకు ప్రతిన పూనాడు. మేవాడీ రాజ్యం



స్వతంత్రం కానిదే ఆరుబయట జీవిస్తా, కటికనేల శయనిస్తా, వెండి, బంగారు పాత్రలను, నగలను ముట్టను అని భీష్మ ప్రతిజ్ఞ చేశాడు. భార్యాపిల్లలతో ఆరావళీ గహనాటవులలో రోజుకొక చోట తరుముతున్న మొగల్ సేనలను, గెరిల్లా పోరాట వ్యూహంతో ఎదిరిస్తూ, అక్బరు గుండెల్లో బల్లెమై జీవించాడు.

అక్బరు మహారాణా ప్రతాపునికి ఎన్నో సందేశాలు పంపాడు. ఆశలు చూపాడు. “నా దర్బారుకు రానక్కరలేదు. నాకు సామంతుడివి కానక్కరలేదు. ‘అక్బరు భారత సామ్రాట్టు’ అని అంగీకరిస్తే చాలు. నీ రాజ్యాన్ని నీవు స్వేచ్ఛగా పరిపాలించుకోవచ్చు” అని మౌనసింహునితో సందేశం పంపాడు. ప్రతాపుడు ఆ సందేశాన్ని తిరస్కరించాడు.

అక్బరు ప్రతాపసింహుల తొలియుద్ధం హల్దీఘాట్‌లో జరిగింది. అదొక అద్భుతగాథ. ఆ యుద్ధంలో జయం ఎవరికీ లభించలేదు. ప్రతాపుడు చివరి ఘడియల్లో శత్రుసైన్యపు వ్యూహాన్ని ఛేదించుకొని బయటపడ్డాడు.

ఒత్తిడి ఎక్కువైంది. దిన వెచ్చంకూడా లభించని దుర్దశ. తమకు తిండిలేదు. అడవి ధాన్యంతో రొట్టెలు చేసి పిల్లల చేతికిస్తే, అడవిపిల్లి వాటిని అపహరించుకుని పోయింది. ప్రతాపుడు క్షణం చలించినట్లు కన్పించింది. ప్రతాప సింహుడు చలించడం అతనికే కాదు, తోటి రాజపుత్రులకు కూడా దుర్భరమైంది. అక్బరు దర్బారులో ఓ కవి పృధ్వీరాజ్ ప్రతాపసింహునికి ఒక లేఖ వ్రాసాడు.

“ఓ సింహమా! ప్రతాపా! దేశంలో నీవొక్కడివే స్వాతంత్ర్యానికి ప్రతీకగా మిగిలావు. ధర్మానికీ ధరిత్రికీ సంరక్షకులుగా సన్మానితులైన మిగతా రాజపుత్రులందరూ అక్బరు అవినీతికి దాసోహమన్నారు కానీ నిన్నే తనకు రక్షకుడని భావించిన మన ధర్మాన్ని ఎలా త్యజిస్తావు? శరణాగతుని రక్షించడం క్షత్రియధర్మం” అని ఉద్బోధించాడు.

“అంతిమ యహ ఉపాయ బీసంభర న బిసారియో
సధేధర్మ సహాయ, పల పల రాణా ప్రతాప్ సే”

1576లో జరిగిన హల్దీఘాట్ యుద్ధం తరువాత కాలం నిరంతర సంఘర్షణతో గడిచింది. ఆ వీరమూర్తి ఆదర్శం దావానలంలా వ్యాపించి అనేక వీర యోధులను సృష్టించింది. భామాసా అనే వణిక్ప్రభువు, ప్రతాపుని మంత్రి తన సర్వ సంపదను ప్రతాపుని పాదాల దాపున క్రుమ్మరించి, పునఃస్సంఘటనకు తోడు నిలిచాడు. అలా ప్రతాపసింహుడు పలు దశాబ్దాలు పోరాడి, క్రమంగా అక్బరు వశపరచుకున్న భూభాగాలను తిరిగి జయించి, మేవాడు రాజ్యాన్ని ముక్తం చేసుకున్నాడు. అతని జీవన కాలంలో అక్బరు తిరిగి మేవాడ్‌వైపు దృష్టి మరల్చలేకపోయినాడు.

ప్రతాపసింహుని రాజ్యం చిన్నదే. కానీ అతను నిలిపి పోయిన ఆదర్శం ఏ జాతికైనా, ఏ దేశానికైనా నిరంతరం ఉపాసించదగ్గది. బాధలకు బలికాకుండా, స్వార్థానికి తలదించకుండా, కోరికలముందు సతమస్తకులు కాకుండా దేశ స్వాతంత్ర్య పిపాసను, ధర్మ దీప్తిని, సంధి షరతుల నెరుంగని నిష్కళంక దేశభక్తిని వీర వృత్తిని వారసత్వంగా మనకు బహూకరించి రాణాప్రతాప్ 1597లో కన్నుమూసాడు.

ప్రతిపసింహుడు రఘు, శ్రీరామచంద్ర, కృష్ణార్జున, చంద్రగుప్త, శాలివాహన మహాజ్యోతిర్మూల పరంపరలో వెలుగొందిన దివ్యరత్నం. అతని స్మరణ జాతికి అమృతోపస్మరణ.

–శ్రీవాణి సౌజన్యంతో

రుచికి, సువాసనకి, ఆరోగ్యానికి నాణ్యమైన
“అజంతా”
వక్కపొడి
రవికుమార్ అండ్ కంపెని – చెన్నై

పఠనాసక్తి

ఆ అబ్బాయిక పన్నెండళ్లు ఉంటాయి. ఇతర మంచి పుస్తకాలు కూడా చదువుతూ ఉండేవాడు. వాళ్లింట్లో చాలా తాటాకుల పుస్తకాలు ఉండేవి. అవి అన్నీ ఓపికగా అధ్యయనం చేస్తూ ఉండేవాడు.

అతడు ఒక్కసారి చదివితే చాలు; అంతా చక్కగా మనస్సుకు ఎక్కేది. పాఠశాలకు వెళ్లే దారిలో ఒక పుస్తకాల అంగడి ఉంది. దానిలో ‘వసుచరిత్ర’ అనే పుస్తకం ఉన్నది.

ఆ అబ్బాయికి ఆ పుస్తకం చదవాలనిపించింది.

ఆ పుస్తకం చాలా ఖరీదు. ఆ రోజుల్లోనే. ఏడెనిమిది నెలల పాఠశాల ఫీజుతో ఆ పుస్తకం వెల సమానం. అది బడి పుస్తకం కాదు... అమ్మ కొనిపెట్టదు... ఏం చేయాలి? అంగడి యజమానితో ఒక ఒప్పందం చేసుకున్నాడు.

“అయ్యా! పుస్తకం ఖరీదులో నెలకు కొంత ఇస్తాను. అది తీరిందాకా పుస్తకం ఇక్కడే చదువుకుంటాను’ అని ఆ ఒప్పందం సారాంశం.

‘సరే బాగానే ఉంది’ అని వ్యాపారి ఒప్పుకున్నాడు.

ఆ అబ్బాయికి బడికి అని బయలు దేరేవాడు. దారిలో ఉన్న అంగడిలో కూర్చుని వసుచరిత్ర చదివేవాడు. దానితో బడికిపోవటం కుదరలేదు.

ఆ సంగతి అబ్బాయివాళ్ల అమ్మకు తెలిసింది. అబ్బాయి ఇంటికి రాగానే గద్దించి అడిగింది. పిల్లవాడు భయపడుతూ “తనకా పుస్తకం చదవాలనిపించింది. అందుకే అది చదువుతూ బడికి పోవటం కుదరలేదు” అని చెప్పాడు.

ఆ అబ్బాయి నిజమే చెప్పినందుకు, అతడి అమ్మ ఎంతో సంతోషించింది. తన కుమారుడిలోని పఠనాశక్తికి ఆశ్చర్యపోయింది. ఎట్లాగో డబ్బులు పోగుచేసి ఆ పుస్తకాన్ని కొని ఇచ్చింది.

అలా ఆ పిల్లవాడు ఇంకా ఎన్నో గ్రంథాలు చదివాడు. పెద్దయినాక మంచి పండితుడు అయ్యాడు. ఎన్నో గ్రంథాలు వ్రాశాడు. సంఘ సంస్కర్తగా పేరుపొందాడు. వితంతువుల కోసం ఆశ్రమాన్ని నెలకొల్పాడు. మంచి గ్రంథాలు సేకరించి గ్రంథాలయాన్ని రూపొందించాడు.

ఆయనే ‘కందుకూరి వీరేశలింగం పంతులుగారు”.

(నా మంచి పూలు పుస్తకం నుండి)

నిరతాన్నదాత్రి
శ్రీమతి డొక్కా సీతమ్మ గారు

డొక్కా ఫణి

(గత సంచిక తరువాయి)

వరహాల శెట్టి కథ:

బొంబాయి మహా నగరంలో ప్రసిద్ధిగాంచిన బంగారు వ్యాపారి ధనగుప్తుడు. విశేషంగా ధనం సంపాదించాడు. అతని కొడుకు నిగమ శర్మ లాంటి వరహాల శెట్టి. చిన్ననాటి నుంచి తల్లియొక్క అతిగారాబం వల్ల చెడిపోయి, జులాయిగా పెరిగాడు వరహాల శెట్టి. అతనికి లేని చెడ్డగుణము లేదు. పెళ్ళి చేసుకుని పిల్లవాణ్ణి కన్నాడు. అయినా అతని శైలిలో మార్పు రాలేదు. వేశ్య మోహంలో పడి భార్యను విడిచి, తన ఆస్తి వాటా గుంజుకొని, దానినీ తగలేసి, భ్రష్టుడై, జైలు పాలయి, ఎప్పటికో విడుదలయి, దొంగగామారి దేశ ద్రిమ్మరి అయ్యి, తిరిగి తిరిగి ఆంధ్ర దేశానికి వచ్చాడు. అప్పుడు ఆంధ్ర దేశములో వర్షాలు పడక కరువు పరిస్థితులు వున్నాయి. అతనికి పట్టెడన్నం పెట్టేవారే లేరు. అతను తిరిగి తిరిగి, చివరకు డొక్కా సీతమ్మగారి ఖ్యాతి విని, కడ ప్రాణాలతో లంకల గన్నవరం వచ్చి చేరాడు. అందరితో పాటు అతనికి కడుపునిండా అన్నం పెట్టారు సీతమ్మగారు. అతను హాయిగా తిని, పెరట్లోకి పోయి పశువుల శాల పక్కన పడుకునేవాడు. మళ్ళీ ఆకలివేసినప్పుడు వచ్చి పంక్తిలో కూర్చుని భోజనం చేసేవాడు. ఇలా కొన్ని రోజులైనతరువాత అతనికి దుర్బుద్ధి కలిగింది. ఒక రాత్రి అతను సీతమ్మగారు ఆరవేసుకొన్న పట్టు చీర దొంగిలించి పారిపోబోయాడు. ఎవరిదో కాలు అడ్డు తగిలి కిందపడ్డాడు. అందరూ లేచి అతనిని స్థంభానికి కట్టేసారు. ఈ విషయం సీతమ్మగారికి తెలియదు. పొద్దున్న అవిడ లేచి ఎంతో బాధపడి, కట్లు విప్పి, వరహాల సెట్టిని విడిపించి "ఆ చీర నేనే అతనికి ఇచ్చాను" అని చెప్పి, అతనికి తల్లిలా తలంటు పోసి, కొత్త బట్టలు తెప్పించి ఇచ్చి గౌరవించారు. అతనికి తృప్తిగా మరల భోజనము పెట్టి, తన వద్దనున్న మొత్తం సొమ్ము యాభై రూపాయలను అతనికి ఇచ్చారు. అతని హృదయం కరిగిపోయింది. అతని దుర్గుణాలన్నీ అంతటితో నశించాయి. అతను సీతమ్మగారి పాదాలు పట్టుకుని చిన్నపిల్లవానివలె ఏడుస్తూ క్షమాపణ కోరాడు. ఆమె అతనిని ఓదార్చి "విధిని తప్పించుకోలేము నాయనా. నీకు లేకపోవడం చేతనే కదా ఇలా తప్పు చేసావు. అందుకే ఈ యాభై రూపాయలతో ఏదైనా కొనుక్కో" మని తల్లిలా చెప్పారు. అప్పుడు వరహాల శెట్టి తన కథనంతా చెప్పి, తనను క్షమింపుమని వేడుకొని, సీతమ్మగారి ఆశీర్వచనములతో తన ఇల్లు చేరి, ఆ యాభై రూపాయలతో మరల వ్యాపారమును వృద్ధి పరచుకొని, దినదినాభి వృద్ధి చెంది ఎంతో సంతోషముగా భార్యా బిడ్డలతో కాలంగడిపాడు. తనజీవితములో ఎప్పుడూ సీతమ్మగారు తనకు చేసిన మేలు మరువలేదు. వీలుకుదిరినప్పుడల్లా కుటుంబంతో వచ్చి సీతమ్మగారి దర్శనం చేసుకునేవాడు.

హరిజనునుకు ప్రాణదానము:

ఒక వర్షాకాలపు నడి రాత్రి. తుఫాను సమయము. ఆకాశం నిండా నల్లని మబ్బులు. విపరీతమైన పోటులో వుంది గోదావరి. ఎవరూ పడవ కట్టడానికి సాహసించని సమయం అది. అటువంటి సమయంలో గోదావరిలోని దిబ్బలలో నుంచి ఒక గొంతు అతి దీనంగ వినబడింది "అమ్మా, సీతమ్మ తల్లీ, ఆకలితో కడుపు కాలిపోతోంది, ప్రేగులు మాడిపోతున్నాయమ్మా. హరిజనుణ్ణి తల్లీ, ఎవరూ నా గోడు వినేవారు లేరు. తల్లీ, పట్టెడన్నం పెట్టి నా ప్రాణాలు కాపాడమ్మా." అప్పటికే ఇంటికి వచ్చిన అందరికీ భోజనాలు పెట్టి, ఇంకా ఎవరైనా తినకుండా మిగిలిపోయారా అని ఒక లాంతరు వేసుకుని వీధి అరుగుమీద చూస్తున్న సీతమ్మగారికి ఆ హరిజనుని ఆర్తనాదాలు వినపడ్డాయి. వెంటనే అతనికి భోజనం అరిటాకులలో కట్టి, కప్పుకోవడానికి రెండు బొంతలు, కట్టుకోవడానికి ఒక పొడి పంచె, వెలిగించుకోవడానికి నాలుగు లంక పొగాకు చుట్టలు ఒక సంచీలో సర్ది, జోగన్న గారికి ఇచ్చి, పడవ కట్టించుకుని వెళ్ళి, ఏరు దాటి, దిబ్బలలో వున్న అతనికి ఇచ్చి రమ్మన్నారు. "ఇంత తుఫానులో, ఈ అర్ధరాత్రి ఎవరూ పడవకట్టరు, ఒక వేళ కట్టినా గోదావరి పోటు విపరీతంగా వుండడం వల్ల పడవ మునిగి ప్రాణాలు పోతాయి, కాబట్టి ఇప్పుడింత సాహసం చెయ్యడం ఎందుకు, రేపు ఉదయాన్నే వెడతాను" అని ఆగారు జోగన్నగారు. "రేపు ఉదయం వరకు అతను బతకడు, నేనే వెళ్ళి వస్తాను, నా ప్రాణాలు పోయినా పరవాలేదు" అని బయలుదేరారు సీతమ్మగారు. సీతమ్మగారి నిశ్చయం ఎరిగిన జోగన్న గారు, తానే బయలుదేరి వెళ్ళి, పడవ వాడిని బతిమాలి పడవకట్టించుకుని, దిబ్బలు చేరుకుని, అతనిని ఆ చిమ్మ చీకటిలో వెతికి పట్టుకుని, అతనికి భోజనం పెట్టి, పొడి బట్టలిచ్చి, ప్రాణాలు నిలిపారు. అతను జోగన్న గారి కాళ్ళు పట్టుకుని, సాష్టాంగ ప్రణామం చేసి, తన ప్రాణములు నిలిపినందులకు కృతజ్ఞతలు తెలిపాడు.



శ్రీమతి ముదునూరు పద్మావతమ్మగారికి మేలు చేయుట:

విజయనగరమనే గ్రామంలో శ్రీ ముదునూరి కృష్ణమరాజు గారిది పేరు ప్రఖ్యాతులు గల కుటుంబం. ఆయన భార్య శ్రీమతి పద్మావతమ్మ. వారికి లేకలేక ఒక మగ బిడ్డ పుట్టాడు. బారసాలనాడు ఉండుండి పద్మావతమ్మగారు పెద్ద కేక పెట్టి వెనక్కు పడిపోయారు. అప్పటినించీ ఎంతో వింతగా ప్రవర్తించేవారు. పిల్లవాణ్ణి విసిరేసేవారు. ఇంటికి వచ్చిన వారిని కొడుతూ, బెదిరిస్తూ, వెక్కిరిస్తూ చాలా చిత్రమైన చేష్టలు చేసేవారు. ఎంతోమంది వైద్యులు పరీక్షించినా ఏమీ కనుక్కోలేకపోయారు. ఆమెను ఒక గదిలో వేసి తాళం పెట్టారు. ఆమె అన్నం తినడము, నీళ్ళు తాగడమూ కూడా మానివేసారు. కోనసీమలో పేరుగాంచిన ఒక శాస్త్రిగారు వచ్చి, ఎన్నో జపములు, హోమములు చేసి, పద్మావతమ్మగారిని రప్పించి ఆమెపై విభూతి చల్లారు. అప్పుడు ఆమె వణుకుతూ శాస్త్రిగారి పాదాలపై పడి, రక్షించమని వేడుకుని, తాను బ్రహ్మ రాక్షసుడననీ, తనను డొక్కా సీతమ్మగారి వద్దకు తీసుకుని పొమ్మనీ, సీతమ్మగారు హరిజనుడి ప్రాణాలు కాపాడిన పుణ్య ఫలం తనకు ధారపోస్తే తనకు విముక్తి కలుగుతుందనీ చెప్పారు. అందరూ ఆమెను సీతమ్మగారి దగ్గరకు తెచ్చారు. తక్షణమే సీతమ్మగారు పండితులను పిలిచి, పద్మావతమ్మగారి చేతిలో ఆ పుణ్య ఫలాన్ని మంత్ర పూర్వకంగా ధారపోసారు. అంతటితో ఆ బ్రహ్మరాక్షసుడు పద్మావతమ్మగారిని విడిచిపెట్టి, సీతమ్మగారికి తన పూర్వ జన్మ వృత్తాంతం ఇలా చెప్పాడుట.

"తల్లీ, మేము బ్రాహ్మలము. ఇద్దరన్నదమ్ములము. మ తల్లి దండ్రులు చిన్నతనమునందే చనిపోయారు. నేను పెద్దవాణ్ణి కావడంతో నా తమ్ముడి పెంపకం నేనూ, నా భార్యా చూసుకునేవాళ్ళం. కొన్నాళ్ళకు నాకు ఆరుగురు కొడుకులు పుట్టారు. వాళ్ళు పెద్దవాళ్ళయ్యేకొద్దీ, నాకు, నా భార్యకు దురాశ పెరిగిపోయింది. ఆస్తిలో నా తమ్ముడికి వాటా ఇవ్వడం మాకు ఇష్టం లేదు. అందుకని తీర్థ యాత్రల పేరుతో అతణ్ణి వేరే వూరు తీసుకెళ్ళి, అక్కడ అతనికి విషాహారం పెట్టి చంపేసాము. తిరిగి మావూరొచ్చి, తమ్ముడు విష జ్వరంతో చనిపోయాడని అందరికీ అబద్ధం చెప్పాము. అయితే నేను చేసిన పాపం నన్ను కట్టి కుదిపింది. నా ఆరోగ్యం శిధిలమై, నేను చనిపోయి, ఇలా బ్రహ్మ రాక్షసుడిగా పుట్టాను. అయితే, నా పూర్వ జన్మ సుకృతం వల్ల నాకు తరుణోపాయం గోచరించింది. చిన్నప్పుడు ఒక హరికథలో అన్నదాన మహత్యాన్ని గురించి చెబుతూ, ఒక శాస్త్రి గారు " ఎవరికైనా బ్రహ్మ రాక్షసి పట్టినచో, వారికి త్రికరణ శుద్ధిగా ఒక రోజు చేసిన అన్నదాన పుణ్య ఫలాన్ని ధారపోస్తే, ఆ బ్రహ్మరాక్షసి విడిచిపోతుంది. అంతే కాక ఆ బ్రహ్మ రాక్షసి కి కూడా విముక్తి కలుగుతుంది" అని అన్నారు. నా అదృష్ట వశాత్తూ నేను ఆ హరికథ విన్నాను. అది గుర్తుకు వచ్చి ఈవిధంగా ప్రవర్తించాను తల్లీ, నేటితో నీ దయ వలన నాకు విముక్తి కలిగింది, అని నమస్కరించి వెళ్ళిపోయాడు. అతను వెళ్ళిన మరుక్షణమే డొక్కా వారి ఇంటికి కొద్ది దూరంలో వున్న రావి చెట్టు పెద్ద కొమ్మ ఫెళ ఫెళ మని శబ్దం చేస్తూ విరిగి పడిపోయింది. తమకు జరిగిన మేలుకు కృష్ణమరాజుగారు, పద్మావతమ్మగారు ఎంతో సంతోషించారు. ప్రతి సంవత్సరము లంకల గన్నవరానికి కుటుంబంతో సహా వచ్చి సీతమ్మగారి దర్శనం చేసుకునేవారు.

1873 శ్రీముఖ నామ సంవత్సరంలో జోగన్న గారి తమ్ముడు జగ్గన్న గారు చనిపోయారు. అప్పుడు జోగన్న గారికి 69 ఏళ్ళు. సీతమ్మగారికి 32 ఏళ్ళు. జగ్గన్న గారి కుమారుడైన నరసయ్య గారిని సీతమ్మగారు సొంత బిడ్డల వలె చూసుకున్నారు.

డొక్కావారి భూములన్నీ మెట్ట భూములు. వర్షాలు లేక వ్యవసాయాలు పాడయ్యాయి. పంటలు పండలేదు. ఎన్నో ఎకరములు గోదావరిలో కలసిపోయినవి. ఖర్చులు ఎక్కువయ్యాయి. మార్గస్థుల రాక ఎక్కువైంది. ఆదాయం తగ్గిపోయింది. రోజులు గడవడం చాలా భారంగా, ఎంతో ప్రయాసగా తయారయింది. అయినా అన్నదానవ్రతానికి ఏమాత్రమూ భంగము రాకుండా కాపాడుకుని వస్తున్నారు జోగన్న గారు, సీతమ్మ గారు. అటువంటి రోజులలో ఒక నాడు మిట్ట మధ్యాహ్న వేళ ఒక బ్రహ్మచారి బ్రాహ్మడు సీతమ్మగారి ఇల్లు వెతుక్కొని వచ్చాడు. అతను స్నానము, జపము పూర్తిచేసుకునే వేళకు భోజనం వడ్డించారు సీతమ్మగారు. అతను ఇలా అన్నాడు "అమ్మా, నేను వివాహం చేసుకోవాలి. సంబంధమైతే కుదిరింది గానీ, ఆ పిల్లకు నేనొక నగ చేయించి ఇస్తేనే వివాహం చేస్తారుట. నా వద్ద సొమ్ము లేదు. నేను ఈ ఒంటి బతుకుతో చాలా కష్టాలు పడుతున్నాను. వివాహం చేసుకుంటే నాకు ఎంతో మేలు జరుగుతుంది. కాబట్టి మీరు మీ మెడలో వున్న ఆ నగ ఇస్తేనే, నేను మీరు వడ్డించిన ఈ భోజనం తింటాను. లేకపోతే తినను". ఇది విన్న జోగన్నగారు సీతమ్మగారిని లోపలికి పిలిచి "మనము సామాన్య సంసారులము. ఇంటికెవరైనా వస్తే భోజనం మాత్రం పెట్టగల స్థోమత మనది, అంతేగానీ, కంటెలూ, కాసుల పేర్లూ ఎక్కడ ఈయగలము? అయినా నీకు మిగిలినది అది ఒక్కటే నగ. దానిని ఇవ్వద్దు" అని చెప్పారు. విన్న సీతమ్మగారు జోగన్నగారి పాదాలపై పడి "మీకు ఎదురుచెప్పడం నాకిష్టంలేదు. కానీ, అతిథి విష్ణుమూర్తితో సమానం. అతనికి భోజనం పెట్టి, తృప్తిగా పంపుదాము. అతని సంసారం నిలబడుతుంది. ఈ నగ వల్ల నాకేమి ప్రయోజనం? ఇది అతనికి ఉపయోగపడుతుంది, నామాట వినండి" అని ఆయన్ని ఒప్పించి అతనికి నగ ఇచ్చి, భోజనము పెట్టి పంపించారు. తీరా చూస్తే ఆ నగ పీట కిందే వదిలి వెళ్ళిపోయాడు ఆ బ్రాహ్మడు. అతనికోసం వూరంతా గాలించినా కనపడలేదు. దిగులుతో ఆరాత్రి సీతమ్మగారికి నిద్రపట్టలేదు. ఎప్పటికో చిన్న కునుకు పట్టింది. అప్పుడు కలలో శ్రీమహా విష్ణువు కనిపించి ఆనాడు తానే అతిథిగా వచ్చానని చెప్పి, ఆమె చిత్త శుద్ధి కి, త్యాగనిరతికి తాను సంతోషించాననీ, ఆమె కీర్తి కలకాలం నిలుస్తుందనీ చెప్పారట. సీతమ్మగారికి మెలకువ వచ్చి జోగన్న గారికి ఈవిషయాన్ని చెప్పారట. వారి సంతోషమునకు అంతులేదు. మరికొన్ని రోజులలో ఇంట్లోని ధనమంతా ఖర్చు అయిపోయింది. మరుసటి రోజు వచ్చే అతిథులకు భోజన వసతులు ఎలా చెయ్యాలో పాలుపోక జోగన్న గారు పొలంలో తచ్చాడుతున్నారు. పొలంలో రైతులు పొలం పని చేస్తూ, మట్టి బెల్లు విరిపిస్తున్నారు. ఇంతలో "ఖణేల్" మన్న శబ్దం జోగన్నగారికి మాత్రము వినిపించినది. ఆయన అంతటితో పని ఆపించి అందరినీ పంపేసారు. తనకు నమ్మకస్తుడైన ఒక పాలేరు సాయంతో అక్కడ తవ్వగా, ఒక కంచు మద్దెల బయట పడింది. దానిని ఇంటికి తెచ్చి పగులగొట్టి చూడగా, దానిలో బంగారపు మొహరీలు దొరికాయి. ఇదంతా దైవానుగ్రహంగా భావించి, తమ అన్నదాన వ్రతమునకు భంగము కలుగకుండా విష్ణుమూర్తి చేసిన ఏర్పాటుగా భావించారు. తిరిగి నిర్విఘ్నముగా ఎన్నో ఏళ్ళు అన్నదాన వ్రతం జరిపారు.

1881 (వృష నామ సంవత్సరం) సెప్టెంబరు మాసంలో జోగన్న గారు చని పోయారు. చనిపోయేముందు పెద్ద పిల్లవాడైన సుబ్బారాయుణ్ణి పిలిచి "తల్లి చేసే అన్నదాన కార్యక్రమానికి ఎప్పుడూ భంగం రానీయకు. తల్లి మాటకు ఎదురుచెప్పకు" అని చెప్పి, ప్రమాణం చేయించుకుని కన్నుమూసారు. సీతమ్మగారు ఎంతో దుః ఖించారు. అయినా గుండె రాయి చేసుకుని, అన్నదాన వ్రతానికి భంగం వాటిల్లకుండా రోజులు గడిపారు.

పోడూరు రాజుగారికి సహాయము:

ఒకసారి పోడూరు రాజుగారి పశువులకు గాళ్ళ వ్యాధి వచ్చింది. అందుచేత వాళ్ళ వ్యవసాయ పనులు ఆగిపోయాయి. అప్పుడు వారు సీతమ్మగారిని సహాయం కోరగా, తమ పశువులను పంపారు. రాజు గారి పశువులు లంకల గన్నవరానికి వచ్చాయి. సీతమ్మగారు వాటిని హాయిగా కొన్నాళ్ళు పోషించారు. వాటి వ్యాధి పూర్తిగా తగ్గిన పిమ్మట వాటిని పోడూరు పంపించారు. రాజుగారి వ్యవసాయానికి డొక్కా వారి పశువులు ఎంతగానో సహాయపడ్డాయి. రాజుగారు ఎన్నో కృతజ్ఞతలు తెలియజేసారు. ఒక ఏడాది లంకల గన్నవరంలో కరువు పరిస్థితులు ఏర్పడి పంటలు పండలేదు. అన్నదానానికి భంగం కలుగకూడదనే ఉద్దేశ్యంతో సీతమ్మగారు తన తమ్ముడు అనప్పిండి సుబ్బారాయుడు గారిని, గన్నవరపు లింగమూర్తిగారిని పోడూరు రాజు గారివద్ద వంద బస్తాల ధాన్యము బదులు తెమ్మని, పంట వచ్చిన వెంటనే తిరిగి ఇచ్చేస్తామని చెప్పి పంపారు. రాజు గారు "సీతమ్మగారు తమకు చేసిన సహాయానికి తాము ఎంతో ఋణపడి వున్నాము" అని చెప్పి, వీరిద్దరినీ అమితంగా ఆదరించి, సత్కరించి, వారికి ఎంతో కాలము విందు చేసారు కానీ ధాన్యం మాట మట్లాడలేదు. ఒకనాడు వీరిద్దరూ తిరిగి లంకల గన్నవరం చేరుకుని ఆ మాట సీతమ్మగారితో చెప్పారు. సీతమ్మ గారు నవ్వి, "మీరు వెళ్ళిన రోజునే రాజుగారు నూరు బస్తాల ధాన్యమూ పంపారు. తిరిగి ఇవ్వ వద్దు అని చెప్పి మరీ పంపారు" అన్నారు. రాజుగారి గొప్ప మనసుకు వారిద్దరూ ఆశ్చర్యపోయారు. రాజుగారు వద్దని చెప్పిననూ, పంటలు పండిన వెంటనే రాజుగారి వంద బస్తాల ధాన్యమూ వారికి పంపించి, కృతజ్ఞతలు తెలియచేసారు సీతమ్మగారు. డొక్కా వారి వంశము ఎన్నడూ ఎవరివద్దనుండీ ఏమీ ఆశించలేదు. ప్రతిఫలమును కోరలేదు.

మశూచి వ్యాధి నయమగుట:

నెల్లూరు జిల్లా కుల్లూరు గ్రామస్థులు కొందరు ముత్యాలు, పగడాల వ్యాపార నిమిత్తమై లంకల గన్నవరము వచ్చేవారు. ఒక ఏడు లంకల గన్నవరములో అంటువ్యాధులు చాలా ఎక్కువయ్యాయి. వాటికి భయపడి ఊరిలోని చాలా మంది తాత్కాలికంగా ఊరు విడిచి వెళ్ళిపోయారు. ఈ నెల్లూరు వ్యాపారులలో లక్కాకుల గోపాలము, ఇరుకుమాటి కృష్ణమూర్తి వడ్డీ వ్యాపారము కూడా చేస్తూ, ఏడాదికి ఆరు నెలలు లంకల గన్నవరంలోనే ఉండేవారు. వారికి మశూచికము సోకింది. వారి దగ్గరికి వెళ్ళడానికే అందరూ భయపడి వారిని వారి ప్రారబ్ధానికి విడిచిపెట్టేసారు. వారు ఆ వ్యాధితో ఎంతో బాధపడ్డారు. దగ్గరకు వచ్చి కాస్త సాయం చేసే నాథుడే లేదు. అప్పుడు సీతమ్మగారు ఈ విషయం తెలుసుకుని, తమ ఇంటికి దగ్గరగా వున్న ఒక ఖాళీ ఇంటిలో వారిని చేర్పించి, వారికి వైద్య సదుపాయాలు కల్పించి, వారి బాగోగులు చూస్తూ, ఎంతో సహాయం చేసారు. వారు త్వరలో పూర్తిగా కోలుకున్నారు. వారు నెల్లూరుకు వెళ్ళి కొద్ది నెలలలో ఎన్నో ముత్యాలు, పగడాలు, ఇతర కానుకలు తెచ్చి సీతమ్మగారికి ఇచ్చారు. సీతమ్మగారు " నాయనా, నేను ప్రతిఫలం కోరి ఏపనీ చేయను. మీకు ఆయుర్దాయం వుండి మీరు బతికారు. ఇందులో నేను చేసినది ఏమీ లేదు" అని వారి బహుమతులను పుచ్చుకొనలేదు. వారు ఎంతగానో అర్థించినను సీతమ్మగారు ప్రతిఫలము తీసుకొనుటకు అంగీకరించలేదు. అప్పుడు ఆ వ్యాపారులు సీతమ్మగారి కుమారుడు సుబ్బారాయుడు గారిని తమ వూరు తీసుకుని వెళ్ళి ఊరేగింపు చేసి, ఎన్నో రీతుల వారిని ఆదరించి పంపారు.

అమరపురితో సమానమైన పేరూరు గ్రామంలో ఒకసారి తీవ్రమైన నీటి ఎద్దడి వచ్చింది. బావులలో నీరు తాగడానికి అనువుగాలేదు. అప్పుడు ఆ గ్రామస్థులు సీతమ్మగారి వద్దకు వెళ్ళి ఈ విషయం చెప్పగా, ఆవిడ 50 రూపాయలిచ్చారు. ఆ డబ్బుతో నుయ్యి తవ్వగా, ఆ నూతిలో ఎంతో తియ్యటి నీళ్ళు వచ్చాయి. (నా చిన్నప్పుడు, ఒక వేసంగుల్లో మా లంకలగన్నవరంలో సీతమ్మగారి బావి లోంచి తోడిన నీళ్ళు నేను తాగాను. అవి కొబ్బరి బొండం నీళ్ళలాగ ఎంతో తియ్యగా వున్నాయి. పక్కన వున్న నూతులలో నీరు మామూలుగా చప్పగా వుంది. ఇది నాకు స్వీయ అనుభవం) . సీతమ్మగారి ఇంట భోజన ప్రసాదము తిన్నచో ఎంతో మేలుకలుగునని భావించి, లెఖ్ఖలేనంత మంది వచ్చి తృప్తిగా సీతమ్మగారి ఇంట భోజనం చేసేవారు. ఒక బ్రిటిష్ కలెక్టరుకు పిల్లలు లేరు. అతను సీతమ్మగారి అన్నదాన వ్రతము గురించి తెలుసుకుని, వారి ఇంటికి వచ్చి భోజనము చేసాడు. కొన్నాళ్ళకు అతనికి కొడుకు పుట్టాడు. అతను తన కుటుంబ సమేతంగా వచ్చి సీతమ్మగారికి నమస్కరించి కృతజ్ఞత తెలియ చేసాడు. ఈ కలెక్టరు ఒకసారి పిఠాపురం జమీందారు శ్రీ రాజారావు మహీపతి గంగాధర రామారావు బహద్దూర్ గారి ఇంటిలో విందుకు హాజరయ్యాడు. అప్పుడు ఆయన జమీందారు గారితో సీతమ్మగారి గురించి చెప్పగా, రాజా గారు ఆశ్చర్యపడి, తనకు తెలియదని, త్వరలో సీతమ్మగారి దర్శనం చేసుకొంటామని చెప్పారు. ఎన్నో సత్రాలను కట్టించి, ఎంతో ధనం ఖర్చుపెడుతున్న మహారాజులకు అలభ్యమైన కీర్తి ఈ సామాన్య స్త్రీకి ఎలా వచ్చిందా అని రాజావారు ఆశ్చర్యపోయారు. త్వరలో రాజా వారు మారు వేషములో తన దివానుగారితో సహా లంకల గన్నవరము వచ్చి, సీతమ్మగారి వీధి అరుగు మీద పడుకున్నారు. జాతి, మత, కుల, ప్రాంత, దేశ భేదాలు లేకుండా, ఎంతో అణకువతో, ప్రేమతో సీతమ్మగారు స్వయంగా చేస్తున్న అన్నదానాన్ని చూసి ఎంతో ఆశ్చర్యపోయారు, ముగ్ధులైపోయారు. పాలు కావలిసిన పిల్లలకు ఆవు పాలు, మజ్జిగ కావలిన పెద్దలకు మజ్జిగ తేట, భోజనములవారికి భోజనములు, ఫలహారములవారికి ఫలహారములు, పథ్యముల వారికి పథ్యం భోజనములు, ఇలా ఎవరికి కావలిసినవి వారికి, అన్ని వేళలా సీతమ్మగారు సమకూరుస్తున్నారు. రాత్రి పొద్దుపోయింది. సీతమ్మగారు ఒక

హరికేను లాంతరు తీసుకుని అరుగుమీదకు వచ్చి, అక్కడ విశ్రాంతి తీసుకొంటున్న వారందరినీ "నాయనా, నువ్వు భోజనం చేసావా? తల్లీ, నువ్వు ఫలహారం తిన్నావామ్మా?" అని అందరినీ అడుగుతున్నారు. మారు వేషములోనున్న రాజా గారిని అడిగారు. ఆయన మొహమాట పడడం గ్రహించి, "అయ్యో, మీరు భోజనము చేయలేదా. రండి, కాస్త భోజనం చేసి, అప్పుడు విశ్రాంతి తీసుకుందురు గాని" అని దివానుగారిని కూడా అడగ్గా, ఆయన సీతమ్మగారిని పరీక్షించదలచి" అమ్మా, నాకు జ్వరము గా ఉంది, ఆకలి లేదు, నోటికేమీ సయించట్లేదు" అని చెప్పారు. అప్పుడు సీతమ్మగారు "అలా అయితే మీకు పథ్యం పెడతాను, రండి బాబూ" అని వారిద్దరినీ లోపలికి తీసుకువెళ్ళి మహారాజుగారికి అన్నీ వడ్డించి, దివాను గారికి చింతకాయ పచ్చడి, నిమ్మకాయ ఊరగాయ వడ్డించి అవి తినేలోపు, బీరకాయ నేతిపోపు కూర తెచ్చి వడ్డించారు. మహరాజు గారికి పెరుగు, దివాను గారికి పథ్యము కనుక పాలు పోసారు. వారిద్దరికీ కొసరి కొసరి తినిపించారు. భోజనాలయ్యాక "నాయనా, బయట గాలి ఎక్కువగా ఉంది. మీకు పడదు. మీకు సావిడిలో పక్కలు వేయిస్తాను, అక్కడే విశ్రాంతి తీసుకోండి" అని చెప్పి, వారికన్ని ఏర్పాట్లు చేసారు. తెల్లవారు ఝామున రాజుగారు, దివాను గారు లేచి గోదావరి కెళ్ళి స్నానం చేసి వచ్చే సరికి అప్పటికే సీతమ్మగారు వంట ప్రయత్నాలలో వున్నారు. చద్దెన్నం తినేవారికి హాయిగా తరవాణికుండలోని అన్నము, ఊరగాయ వడ్డిస్తూ వారి కడుపు నింపుతున్నారు. ఇది చూసిన రాజుగారు "ఇక్కడ జరిగినట్లుగా ఇంకెక్కడా జరుగదు. ఏ మహారాజు ఎంత ధనం వెచ్చించినా కూడా ఇంత శ్రద్ధగా, ప్రేమగా అన్నదాన వ్రతము ఆచరించడం అసాధ్యం. ఈవిడ సాక్షాత్తూ కాశీ అన్నపూర్ణే " అని నిశ్చయించుకుని, దివాను గారితో సహా సీతమ్మగారి పాదములపై పడి, తమ తప్పు క్షమింపమనీ, తాము మారువేషములో వున్న మహారాజులమనీ చెప్పారు. సీతమ్మగారు తలుపు చాటుకు వెళ్ళి "అయ్యో, నాయనా నాకు తెలియలేదు. మీకు తగిన సదుపాయాలు ఏర్పాటు చెయ్యలేకపోయాను, ఏమీ అనుకోవద్దు" అని బాధపడ్డారు. అప్పుడు గంగాధర రామారావు రాజు గారు తమకు ఏవిధమైన లోటూ జరగలేదని చెప్పి, "మీ ఆదరణ, వితరణ మాకు ఎంతో సంతోషం కలిగించాయి. మీకు ఒక గ్రామాన్ని రాసి ఇస్తాము, మీరు మీ అన్నదానాన్ని కొనసాగించండి" అని చెప్పారు. అప్పుడు సీతమ్మగారు "మీ దయకు చాలా కృతజ్ఞతలు. కానీ, ఇతరుల సహాయంతో అన్నదానం చేస్తే, అది అన్నాన్ని అమ్ముకోవడంతో సమానమౌతుంది. దానివల్ల దుర్గతులు ప్రాప్తిస్తాయి నాయనా. అందుచేత నేను ఈ దానాన్ని స్వీకరించలేను, క్షమించండి" అని సున్నితంగా తిరస్కరించారు. చేసేది లేక రాజుగారు సీతమ్మగారికి కృతజ్ఞతలు తెలిపి దివానుగారితో సహా తమ సంస్థానానికి వెళ్ళిపోయారు.

బ్రిటిష్ చక్రవర్తి ఏడవ ఎడ్వర్డు గారి పట్టాభిషేకమునకు ఆహ్వానము:

సీతమ్మగారి చరిత్ర, ఖ్యాతి ఇంగ్లాండువరకు వ్యాపించింది. అప్పుడు భారత దేశాన్ని పరిపాలిస్తున్న బ్రిటిష్ చక్రవర్తి ఏడవ ఎడ్వర్డు గారు సీతమ్మగారి ప్రఖ్యాతి విని, ఏటా ఢిల్లీ లో జరుగు తన పట్టాభిషేకోత్సవమునకు ఆహ్వానము పంపారు. 1902 డిసెంబరులో సీతమ్మగారికి పట్టాభిషేక ఆహ్వానం వచ్చింది. అప్పటికి సీతమ్మగారికి61 ఏళ్ళు. ఆవిడ తను పొగడ్తల కొరకో, పేరు కొరకో అన్నదానము చేయుటలేదని విన్నవించి, పట్టాభిషేకమునకు వెళ్ళలేదు. అప్పుడు చక్రవర్తి తన రాజ ప్రతినిధిని డొక్కా సీతమ్మగారి ఫొటో తీయించి పంపవలసిందిగా ఆదేశించారు. ఆమె దానికి కుడా ఒప్పుకోలేదు. చివరికి మెజిస్ట్రేటు వచ్చి, ఫొటో పంపనిచో తన ఉద్యోగం పోతుందని బతిమాలడంతో, ఇక తప్పదని గ్రహించి, సీతమ్మగారు ఫొటో ఇవ్వడానికి ఒప్పుకున్నారు. "నాకు లేని పోని ఘనతలు కల్పించి నన్ను బాధించవద్దు, క్షమింపుము" అని ఆవిడ కలెక్టరును, మెజిస్ట్రేటును వేడుకుని, వారిని సత్కరించి పంపేసారు. ఫొటో చక్రవర్తిగారికి చేరింది. దానిని పెద్ద పటము కట్టించి, 1903 జనవరి ఒకటవ తేదీన ఢిల్లీ లో జరిగిన తన పట్టాభిషేకమహోత్సవంలో తమ సింహాసనానికి ఎదురుగా ఆ ఫొటోను ముఖ్య అతిథుల వరుసలో వేరొక సింహాసనం పై ఉంచి గౌరవించారు. సీతమ్మగారి త్యాగాన్ని గుర్చి ఒక యోగ్యతా పత్రాన్ని గవర్నర్ జనరల్ ద్వారా పంపారు. శివకోడు తహసీల్దారు గారు వి.పి.పద్మనాభరాజు గారు మార్చ్ 15, 1903 నాడు ఆ యోగ్యతాపత్రాన్ని సీతమ్మగారికి అందజేసారు. సీతమ్మగారు ఆయనతో "నాయనా, మానవసేవే మాధవ సేవ అని నమ్మి నేను నా విధి నిర్వహిస్తున్నాను. నాకెందుకీ యోగ్యతా పత్రాలు? దేవుడి దయవల్ల నా అన్నదానానికి ఇంతవరకూ ఎటువంటి లోటూ జరగలేదు" అన్నారు. ఆ తహసీల్దారుగారు సీతమ్మగారికి సాష్టాంగ ప్రణామం చేసి, నచ్చ చెప్పి, తన విధి తాను చేస్తున్నాను అని ఒప్పించి, ఆ యోగ్యతా పత్రం అందినట్లు రసీదు తీసుకుని వెళ్ళిపోయారు. ఇలా ప్రతి సంవత్సరం డొక్కా సీతమ్మగారికి బ్రిటిష్ చక్రవర్తిగారి పట్టాభిషేక ఆహ్వానాలు అందుతూనే వున్నాయి. ఇది భారతదేశంలో మరెవ్వరికీ దక్కని అరుదైన గౌరవం.

1908 లో సీతమ్మగారికి 68 ఏళ్ళ వయసులో చేతిమీద కేన్సర్ వచ్చినది. పెద్ద వైద్యం చేయించాలని సుబ్బారాయుడుగారు ప్రయత్నించారు. కానీ సీతమ్మ గారు ఒప్పుకోలేదు. "ప్రారబ్ధాన్ని అనుభవించి తీరాలి కానీ, తప్పించుకోకూడదు. కర్మ ఫలితం వల్లనే సుఖ దుఃఖాలు, లాభ నష్టాలు కలుగుతాయి. ప్రారబ్ధం భోగతో నశ్యేత్ – ప్రారబ్ధమనేది అనుభవించడం వల్లే తీరుతుంది" అని చెప్పి వైద్యం చేయించుకోవడానికి అంగీకరించలేదు. సుబ్బారాయుడు గారితో "నాయనా, నేను వెళ్ళిపోతున్నాను. మీకెన్ని కష్టాలు వచ్చినా అన్నదానం మానద్దు. అన్నం పెట్టేప్పుడు కులం, మతం, ప్రాంతం, జాతి – ఏమీ చూడద్దు. వాటిని మనం పాటించకూడదు. అన్నదానాన్ని మించినది మరొకటి లేదు. నువ్వు అన్నదానం నిర్విఘ్నంగా చేస్తానని నా చేతిలో చెయ్యేసి మాటియ్యి. అప్పుడు నేను నిశ్చింతగా వెళ్ళిపోతాను" అని ఒట్టు వేయించుకున్నారు సీతమ్మగారు. ఏప్రిల్ 28, 1909 వైశాఖ శుద్ధ నవమీ బుధవారం నాడు, మధ్యాహ్నం 12 గంటలకు సీతమ్మగారు లంకల గన్నవరంలో తమ ఇంట్లో కుటుంబాన్ని, ఆశ్రితులనీ, గ్రామస్థులనీ అందరినీ విడిచి దేవుడి దగ్గరికి వెళ్ళిపోయారు. అదే సమయంలో దగ్గరలోని ఇందుపల్లి గ్రామం లో శ్రీ మంథా నరసింహ మూర్తి గారి ఇంటి దగ్గర శ్రీ కాలనాథభట్ల వెంకయ్యా గారు "పఠాను" ఏకపాత్రాభినయం చేస్తున్నారు. మహా పండితులు శ్రీ.వెంపరాల సూర్యనారాయణ శాస్త్రి గారు ఆ ఏకపాత్రాభినయాన్ని చూసి ఆనందిస్తున్నారు. ఇంతలో ఆకాశంలో ఒక గొప్ప తేజస్సు పడమర నించి తూర్పుకి ఒక గుండ్రని బంతిలా అమితమైన వేగంతో వెళ్ళడం చూసి " ఎవరో గొప్ప వ్యక్తి మరణించారు" అన్నారు శాస్త్రి గారు. కొద్దిసేపటికే డొక్కా సీతమ్మగారు చనిపోయారనే వార్త దావానలంలా వ్యాపించింది.

తల్లికి ఇచ్చిన మాట ప్రకారము సుబ్బారాయుడుగారు అన్నదానవ్రతాన్ని కొనసాగించారు. పట్టాభిషేక ఆహ్వానాలు వస్తూనే వుండేవి. ఎన్నో భూములు హరిజన వాడలకు ఇచ్చేసారు. ఆస్తులు కరిగిపోయినా, భూములు, వ్యవసాయము లేకపోయినా అన్నదానము కొనసాగించారు.

సుబ్బారాయుడు (భార్య సుబ్బమ్మ గారు) గారి కుమారులు 1.రామ జోగన్న గారు 2.సూరన్న గారు 3.రామభద్రుడు గారు

1917 సెప్టెంబరు లో (పింగళ నామ సంవత్సరం భాద్రపద శుద్ధ త్రయోదశి నాడు) సుబ్బారాయుడు గారు చనిపోయారు. కాలక్రమేణా ఆస్తులు కరిగిపోయి, భూములు లేక, వ్యవసాయము లేక పోయినా, తమ శక్తి కొలది సీతమ్మగారి మనుమలు, మునిమనుమలు, డొక్కా వంశస్థులు అందరూ తమకు తోచిన రీతిలో అతిథులనూ, అభ్యాగతులనూ ఆదరించారు, ఆదరిస్తున్నారు.

ఈ నా రచనకి శ్రీ మిర్తిపాటి సీతారామ చయనులు గారు అరవై సంవత్సరాల క్రిందట వ్రాసిన "శ్రీ నిరతాన్నదాత్రి డొక్కా సీతమ్మగారి జీవిత చరిత్ర" అనే పుస్తకం ఎంతో ఉపయోగపడింది. వారికి, వారి వంశస్థులకూ సదా కృతజ్ఞుణ్ణి.

కాశీలో గర్భగుడిలో సీతమ్మగారి ఫొటో కొన్నాళ్ళు వుండేదని పెద్దలు చెప్పగా విన్నాను. అలాగే మా స్నేహితుని తల్లిదండ్రులు కొన్నేళ్ళక్రితం కాశీలోని చింతామణి గణపతి ఆలయంలో హోమం, యజ్ఞం చేయించారు. అప్పుడు అక్కడి శిలాఫలకంపై "చింతామణి గణపతి ఆలయానికి లంకల గన్నవరం డొక్కా వంశస్థులు మాన్యపు భూములను ఇచ్చారు" అని వున్నదట. ఆయన (మా అట్లాంటా లోనే వున్న) వాళ్ళ అబ్బాయికి చెప్పగా, అతను నాకు చెప్పిన విషయం ఇది.

రెండు దశాబ్దాల క్రితం వరకు తెలుగు వాచకంలో డొక్కా సీతమ్మగారిపై పాఠం వుండేది. ఇప్పుడు లేదు. సీతమ్మగారి సేవలను గుర్తించి, కొన్నేళ్ళ క్రితం, గన్నవరం అక్విడెట్టు వద్ద, సీతమ్మగారి శిలా విగ్రహం ఏర్పాటు చేసిన ప్రభుత్వానికీ, రాజకీయ నాయకులకు, సహృదయులైన ప్రజలకు అందరకూ కృతజ్ఞతలు. నేటికీ సీతమ్మగారిని తమ గుండెలలో నిలుపుకుని, ఆమె చేసిన సేవలను స్ఫూర్తిగా తీసుకుని, ఆమె జీవితాన్ని కథలుగా, నాటకాలుగా, పద్య రూపకాలుగా అందరికీ అందిస్తున్న కవి పండితులకూ, ప్రతినిత్యమూ సీతమ్మగారిని స్మరించుకుంటూ, సాటి మనుషులకు సహాయపడుతున్న తెలుగువారందరికీ శిరసా ప్రణామం చేస్తున్నాను. ●

కాశీనాథుని నాగేశ్వరరావ్వ పంతులు

బహుముఖ ప్రజ్ఞాశాలి, రాజనీతిజ్ఞులు, గుప్తదాత, దేశభక్తులు, పత్రికా సంపాదకులు, ప్రచురణకర్త, స్వాతంత్ర్య సమరయోధులు.

'ఆంధ్రపత్రిక నడపడమంటే పెద్ద తలనొప్పి సుమండీ!' అన్నారట కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు గారు. 'పరవాలేదు. అమృతాంజనం కూడా మీదే కదా!' అని చమత్కరించారట రాజాజీ.

భారతీయ పత్రికలను బ్రిటిష్ ప్రభుత్వం వెంటాడుతున్న కాలమది. అలాగే స్వాతంత్ర్యోద్యమాన్ని కర్కశంగా అణచివేస్తున్న సమయం కూడా అదే. ఆ సమయంలో ఇటు పత్రికా నిర్వహణ లోను, అటు స్వరాజ్య సమరంలోను కీలకంగా నిలిచినవారు కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు గారు. ఆయన స్థాపించిన ఆంధ్రపత్రిక తెలుగు వారి ఉద్యమానికి, సంస్కృతికి, సాహిత్యాభిలాషకి అద్దం పట్టింది. తలనొప్పి - అమృతాంజనం జంటపదాలైనాయి.

ఎన్నో పత్రికలు రావచ్చు. పోవచ్చు. కానీ ఆంధ్రపత్రికకు ఉన్న స్థానం చరిత్రలో మరొక పత్రికకు రాలేదు. అలాగే తలనొప్పికి అమృతాంజనమే ఈరోజుకీ దివ్యౌషధం. భారత స్వాతంత్ర్య సమరం పదునెక్కుతున్న సంగతిని గమనించి అందుకు సంబంధించిన వార్తలను తెలుగులో అందించాలన్న ఆశయంతో ఆంధ్రపత్రికను స్థాపించారు పంతులుగారు. ఆయన స్వయంగా స్వాతంత్ర్య సమరంలో పాల్గొన్నారు.

1838 ప్రాంతంలో తెలుగులో పత్రికల ప్రచురణ (వృత్తాంతి) ప్రారంభమైనప్పటికీ ఆంధ్రపత్రిక వచ్చే వరకు వాటికి పూర్తి స్వరూపం రాలేదంటే అతిశయోక్తి కాదు. ఆంధ్రపత్రిక ఆవిర్భవించిన నాటికి గట్టుపల్లి శేషాచార్యులు గారు అనే పండితులు మద్రాసు నుంచి వెలువ రిస్తున్న 'శశిలేఖ', ఏపీ పార్థసారథి నాయుడు (ఇది కూడా మద్రాసులోనే అచ్చయ్యేది) నిర్వహిస్తున్న 'ఆంధ్రప్రకాశిక', కొండా వెంకటప్పయ్య గారు తదితరులు మచిలీపట్నం నుంచి ప్రచురిస్తున్న 'కృష్ణాపత్రిక' ప్రధానంగా ఉండేవి. మొదటి ప్రపంచ యుద్ధం వార్తలు కూడా తెలుగువారికి తెలియాలన్న ఉద్దేశం కూడా పంతులుగారికి ఉండేదట.

జీవిత విశేషాలు:

కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు గారు మే 1, 1867 న కృష్ణా జిల్లాలోని ఎలకుర్రులో పుట్టారు. తండ్రి బుచ్చయ్య, తల్లి శ్యామలాంబ. ప్రాథమిక విద్య స్వగ్రామంలోను, తరువాత మచిలీపట్నంలోను పూర్తయింది. ఆ చదువు చాలునని తండ్రి అభిప్రాయం. కొడుకు చదువులు, ఉద్యోగాల పేరుతో వేరే ఊళ్లో ఉండడం ఆయనకు ఇష్టం లేదు. కానీ ఆ తల్లి మాత్రం కొడుకు పెద్ద చదువులు చదవాలని పట్టుపట్టి మద్రాసు పంపింది. అక్కడే ఆయన క్రిస్టియన్ కాలేజీలో బీఏలో చేరారు. కానీ ఎందుకో మరి, మధ్యలోనే చదువు విడిచి పెట్టేశారు. ఆ కాలేజిలో ప్రముఖ విద్యావేత్త డా.రెవరెండ్ మిల్లర్ ప్రభావం ఆయనపై బడింది. వివేకవర్ధనిలో కందుకూరి వీరేశలింగం వ్యాసాలు కూడా ఆయనను ప్రభావితం చేశాయి.

అక్కడ ఉండగానే రెంటాల సుబ్బారావు అనే ప్రముఖ న్యాయవాదితో పరిచయం ఏర్పడింది. ఆయన కోరిక మేరకు ఆయన మేనకోడలు రామాయమ్మను పంతులు గారు వివాహం చేసుకోవడానికి అంగీకరించారు. ఇందుకు ఆయన తల్లి అంగీకరించలేదు. పెళ్లికి కూడా రాలేదు. 1890 సంవత్సరంలో పెళ్లి జరిగింది. వీరికి ఒక కూతురు కామాక్షమ్మ. సుబ్బారావుగారు న్యాయవాది మాత్రమే కాదు. వ్యాపారవేత్త. అక్కడే కాబోలు మొదట పంతులుగారిలో వ్యాపారం చేయాలన్న ఆశయం అంకురించింది. అందుకే కాబోలు ఏ ఉద్యోగంలోను చేరలేదు. బొంబాయి వెళతానని చెప్పారు తల్లికి. అందుకు కూడా ఆమె అంగీకరించలేదు. మళ్లీ తల్లి మాట ధిక్కరించి ఆయన వెళ్లారు.

వ్యాపారం:

1892 నుంచి రెండేళ్ల పాటు అక్కడే వ్యాపారం చేశారు. తరువాత ఔషధాల వ్యాపారంలో తర్ఫీదు కోసం కలకత్తా వెళ్లారు. మళ్లీ బొంబాయి చేరుకున్నారు. అక్కడే విలియం అండ్ కో సంస్థలో చేరారు. అది ఐరోపా వారి సంస్థ. ఆ యజమాని అభిమానానికి పంతులు గారు పాత్రులయ్యారు. అదే వరమైంది. ఆ సంస్థ యజమాని స్వదేశం వెళ్లిపోవాలని అనుకున్నాడు. వ్యాపారం మొత్తం పంతులుగారికి అప్పగించి వెళ్లిపోయాడు. ఆ వ్యాపారం చేతికి వచ్చాకనే 1899లో పంతులుగారు అమృతాంజనం తయారు చేయడం ఆరంభించారు. 1903 నాటికి ఆ వ్యాపారం ఇతోధికంగా పెరిగిపోయింది. విదేశాలకు కూడా ఎగుమతి అయ్యేది. అప్పుడే లక్షలలో ధనం వచ్చిపడింది. తన మందుల దుకాణానికి 'అమృతాంజనం డిపో' అని పేరు పెట్టారు.

ఆయన తలచుకొంటే లక్షలపై లక్షలు ఆర్జించి కోట్లకి పడగలెత్తేవారు. ఆడంబర రాజకీయాల జోలికి పోలేదు. అమృతాంజనం ద్వారా గణించిన డబ్బును పేద విద్యార్థులకి వేతనాలుగా ఇచ్చేసేవారు. ఆయన దేశభక్తినీ వితరణశీలాన్నీ గాంధీ

మహాత్ముడు కూడా మెచ్చుకున్నారు.

పత్రికా రంగం:

బొంబాయి, కలకత్తా - ఈ రెండు నగరాలు స్వాతంత్ర్యోద్యమంలో కీలకంగా ఉన్నాయి. అప్పటికే రాజకీయంగా ఎంతో చైతన్యం పొందాయి. కలకత్తా బెంగాల్ విభజన వ్యతిరేకోద్యమంతోను, మహారాష్ట్ర భారత జాతీయ కాంగ్రెస్ ప్రభావంతోను ఉద్యమ వేడితో ఉండేవి. ఆ రెండు నగరాల మధ్యనే పంతులుగారు చిరకాలం తిరిగారు. అందుకే అక్కడి ప్రభావం ఆయన మీద బాగా పడింది. తాను వ్యాపారంలో బాగా రాణించి స్థిరపడిన కాలంలో మహారాష్ట్ర పత్రికలు ఇస్తున్న చైతన్యంతో జాతీయ భావధారంలో ఊగుతూ ఉండేది. తెలుగువారి కోసం కూడా ఆ స్థాయిలో పత్రిక నిర్వహించాలని పంతులుగారు ఆకాంక్షించారు. అందుకే మొదట ఆంధ్రపత్రిక వారపత్రికను బొంబాయిలో 1908లో ఆరంభించారు. అంతకు ముందు సంవత్సరం జరిగిన సూరత్ కాంగ్రెస్ సభలకు ఆయన హాజరయ్యారు. అది ఆయన ఆలోచనను మరింత వేగవంతం చేసింది.

1910 లో ఆంధ్రపత్రిక ఉగాది సంచికల ప్రచురణను ఆరంభించారు. ఆ సంచికలు ఇప్పటికీ తెలుగు ప్రాంతంలోని కొన్ని గ్రంథాలయాలలో లభ్యమవుతాయి. వాటిని చదవడం నిజంగా గొప్ప అనుభవం.అందులో 'ప్రస్తావన' పేరుతో ఒక శీర్షిక ఉండేది. అచ్చులో కనీసం నలభై యాభై పేజీలకు తక్కువ కాకుండా ఉండేది. దానిని స్వయంగా పంతులుగారే రాసేవారు. ప్రపంచ యుద్ధకాలంలో కూడా ఈ శీర్షిక దర్శనమిచ్చేది. అయితే కొన్ని పేజీలు తక్కువగా ఉండేవి. న్యూస్ ప్రింట్ కొరత కారణంగా అన్ని పేజీలు ఇవ్వలేకపోతున్నామని 'గమనిక'లో వాపోయేవారు. ఈ శీర్షిక ప్రపంచం మొత్తం మీద ఒక విహంగ వీక్షణం. వివిధ ప్రపంచ దేశాల విశేషాలు, భారత స్వాతంత్ర్యోద్యమం, తెలుగు ప్రాంతం, అంటే మద్రాస్ ప్రెసిడెన్సీ వివరాలు అన్నీ అందులో ఉండేవి. ఆర్థిక, సామాజిక, రాజకీయ పరిణామాలు మొత్తం ఆయన ఇందులో విశ్లేషించేవారు. ఆయన 28 ఏళ్ల పాటు ఆ శీర్షిక నిర్వహించారు. అంటే తుదిశ్వాస విడిచేవరకు.

కానీ తెలుగువారు బాగా తక్కువగా ఉన్న బొంబాయిలో ఆయన ఇమడలేకపోయా`ని అనిపిస్తుంది. వ్యాపారం, కుటుంబం, పత్రిక మద్రాసు తరలించాలన్న ఆలోచనకు వచ్చారు. సూరత్ సభలకు వెళుతూ గిర్గావ్‌లో ఉన్న పంతులుగారి ఇంటిని ఆనాడు అవటపల్లి నారాయణరావు గారు ఇంకొందరు సందర్శించారు. ఈ అనుభవాన్ని, పంతులుగారి ఆతిథ్యం గురించి అవటపల్లి ఒక వ్యాసంలో చక్కగా వర్ణించారు.

భారత స్వాతంత్ర్యోద్యమాన్ని అక్షరాలలో దర్శించే భాగ్యమైనా కలిగించినవారు పంతులుగారే. మారుమూల గ్రామాలకు కూడా ఆంధ్రపత్రిక తపాలా శాఖ ద్వారా బట్వాడా అయ్యేది. మద్రాస్ చేరుకున్న తరువాత 1914 లో ఆంధ్రపత్రిక దినపత్రికను ఆరంభించారు. మరోపక్క వార పత్రిక కూడా వెలువడేది. అంటే మొదటి ప్రపంచ

యుద్ధం, ఆంధ్రపత్రిక ఒకే సంవత్సరంలో ఆరంభమైనాయి.

దేశోద్ధారక :

మద్రాసు ప్రెసిడెన్సీనుండి ఆంధ్ర ప్రాంతాన్ని ప్రత్యేక రాష్ట్రంగా విభజించాలన్న ఉద్యమానికి అరంభ దశ నుండి నాయకులుగా ఉన్నవారిలో నాగేశ్వరరావు ఒకడు. ఈ విషయమై తన పత్రికలలో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ విషయం లోనూ, తెలుగు భాష, సంస్కృతిలకు సంబంధించిన ఇతర విషయాలలోనూ ఆయన తెలుగు జాతికి చేసిన సేవను గౌరవిస్తూ తెలుగువారు ఆయనను దేశోద్ధారక అనే బిరుదు తో సత్కరించారు.

ఆంధ్ర గ్రంథమాల:

పత్రికా నిర్వహణ భారమనుకుంటూనే మరోపక్క ఆంధ్ర గ్రంథమాల అనే సంస్థను స్థాపించారు. స్వయంగా తమ రచనలు ముద్రించుకోలేని ఎందరో రచయితల పుస్తకాలను అచ్చువేయించే పనిని పంతులుగారే చేపట్టారు. బసవ పురాణం, పండితారాధ్య చరిత్ర, భగవద్గీతా వ్యాఖ్యానం కూడా అచ్చు వేయించారు.

ఈ సంస్థ 30 పైగా పుస్తకాలు ప్రచురించింది. వాటిలో 27 వ పుస్తకం, తిరుమల వెంకట రంగాచార్యులు గారు సంకలనం చేసిన పారిభాషిక పదకోశము ఇంకా అనేక ప్రాచీన గ్రంథాలను పునర్ముద్రించింది. సామాన్యులకు అందుబాటులో ఉండాలని ఈ పుస్తకాల వెలను చాలా కొద్ది మొత్తంగా నిర్ణయించారు. తెలుగునాట గ్రంథాలయోద్యమానికి నాగేశ్వరరావు గారిని పితామహునిగా వర్ణించవచ్చును. కాలక్రమంగా 120 పైగా గ్రంథాలయాలు తెలుగునాట వెలశాయి.

ఇందులో భగవద్గీతా వ్యాఖ్యానం ఆయన జైలుకు వెళ్లినప్పుడు స్వయంగా రాసినదే. ఇదంతా ఉచితంగా చేశారాయన. కొమర్రాజు లక్ష్మణరావు పంతులుగారు అసంపూర్ణంగా వదిలేసిన ఆంధ్ర విజ్ఞాన సర్వస్వం ప్రచురణ భారాన్ని కూడా నాగేశ్వరరావుగారే తలకెత్తుకున్నారు.

ఇవి కాక, ఆయన చెన్నపట్నంలో తన కార్యాలయం బయటకు వస్తే చాలు కనీసం అయిదారుగురు అక్కడ వేచి ఉండేవారట. ఒకరు కన్నీళ్లతో తన కూతురు పెళ్లికి డబ్బు సాయం చేయమని అడిగేవారట. ఇంకొకరు తాను రాసిన పుస్తకం అచ్చు వేయించుకునే శక్తి లేదని దీనంగా చెప్పేవారట. ఒక విద్యార్థి పరీక్షకో, ఫీజుకో సాయం చేయమనే వారట. మరొకరు మరొక కారణం–అయితే అందరికీ కూడా ఆయన డబ్బు ఇచ్చి పంపేవారు. వారి బాధ తన బాధగా భావించి ఒక ఉద్వేగంతో ఆయన డబ్బు ఇచ్చేవారని ఆయన జీవిత చరిత్ర రాసినవారు పేర్కొనడం విశేషం. ఆయనకు గాంధీజీయే 'విశ్వదాత' అన్న బిరుదును ఇచ్చి గౌరవించారు.

రాజకీయాలు:

టంగుటూరి ప్రకాశం గారి కి సమకాలీనుడైన నాగేశ్వరరావు గారు 1924 – 1934 మధ్యకాలంలో నాలుగు సార్లు ప్రాంతీయ కాంగ్రెస్ కమిటీకి అధ్యక్షునిగా ఉన్నారు. ముఖ్యంగా ఖద్దరు ఉద్యమానికి నాగేశ్వరరావు గారు బలమైన మద్దతును, సహకారాన్ని అందించారు. అలాగే ఉప్పు సత్యాగ్రహం సమయంలో చురుకుగా పాల్గొన్న నాయకులలో ఆయన ఒకరు. నాగేశ్వరరావు గారి పై ప్రజలకు ఎంతో అభిమానం, నమ్మకం ఉండేవి.

హరిజనోద్ధరణ:

పంతులుగారు గాంధీగారి కంటే ముందే హరిజనోద్ధరణ కార్యక్రమం చేపట్టారు. తన సొంతూరులో తల్లి శ్యామలాంబగారి పేరుతో ఒక విద్యాలయాన్ని నెలకొల్పి అందులో హరిజన బాల బాలికలకు అవకాశం కల్పించిన మహనీయుడు. వారి దీనస్థితికి చింతిస్తూ రెండెకరాల భూమి కొని అందులో నలభై ఇళ్లను నిర్మించి ఇచ్చారాయన. 1932లో ఆవిర్భవించిన ఆంధ్ర రాష్ట్ర హరిజన సేవా సంఘానికి ఆయన అధ్యక్షులు కూడా. హిందీ ప్రచారం, ఖద్దరు ఉద్యమం పంతులుగారి జీవితంలో కనిపించే మరో రెండు కోణాలు. 1923లో కాకినాడలో జాతీయ కాంగ్రెస్ సభలు జరిగినప్పుడే హిందీ సాహిత్య సమ్మేళనం కూడా జరిగింది. ఆ సభలకు పంతులుగారే ఆహ్వాన సంఘాధ్యక్షులు.

విజయవాడలోని నాగేశ్వరరాయ హిందీ భవన్ ఆయన చలవతో ఏర్పడినదే. అలాగే గ్రంథాలయోద్యమంలో కూడా ఎంతో చురుకుగా పాల్గొన్నారు. ఎంత చిన్న గ్రంథాలయమైనా దానికి ఆంధ్రపత్రికను ఉచితంగా పంపేవారాయన. 1919లో మద్రాసులోని గోఖలే హాలులో జరిగిన అఖిల భారత గ్రంథాలయ సభకీ, ఆంధ్ర సారస్వత సభలకు కూడా ఆయనే సారథి.

విశ్వదాత:

నాగేశ్వరరావు గారు అసమాన దానశీలి. ఆయన ఇల్లు ఎప్పుడూ అతిధుల తోనూ, అర్థులతోనూ కళకళలాడుతుండేది. వివిధ సేవా కలాపాలకు ధారాళంగా ఆయన సహాయం చేస్తుండేవారు.. ఆయన ఇంటినుండి వట్టి చేతులతో ఎవరూ వెళ్ళేవారు కాదు. ఆయన దాతృత్వానికి అబ్బురపడి మహాత్మా గాంధీ ఆయనను విశ్వదాత అని కొనియాడారు..

భారతి పత్రిక:

1924 సంవత్సరంలో ఆయన 'భారతి' మాస పత్రికను నెలకొల్పారు. ఇది ఒక అత్యున్నత అభిరుచికి తార్కాణంగా కనిపిస్తుంది. ప్రతి సంచిక ఒక ఆణిముత్యమే. సాహిత్యం, చరిత్ర, పురావస్తు శాస్త్రం, అర్థశాస్త్రం, రాజనీతి ఒకటేమిటి – ప్రతి విశిష్ట అంశాన్ని 'భారతి'లో పాఠకులు దర్శించేవారు. తెలుగు సాహిత్యానికి ఈ పత్రిక చేసిన సేవ వెలకట్టలేనిది.

ఇవన్నీ ఉన్నా స్వాతంత్ర్యోద్యమం, ఆంధ్ర ఉద్యమం కూడా పంతులుగారి జీవితంలో కీలకంగానే కనిపిస్తాయి. ఆంధ్రరాష్ట్ర అవతరణకు కీలక ఒప్పందం జరిగిన శ్రీబాగ్ మద్రాసులో పంతులుగారి నివాసమే. 1924, 1929, 1930, 1934 సంవత్సరాలలో ఆంధ్ర రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షులు కూడా పంతులు గారే. పంతులు గారి కృషిని అంచనా వేయడం అంత సులభం కాదు. ఆయన పత్రికా నిర్వాహకుడు. స్వయంగా పత్రికా రచయిత. కళోద్ధారకుడు. చిన్నప్పుడు స్వయంగా నాటకాలలో నటించిన అభిమానం ఆయనకు జీవితాంతం ఉండిపోయింది. అందుకే నాటక కళకు కూడా ఆయన సేవలు దక్కాయి. వీటితో పాటు జీర్ణ దేవాలయోద్ధరణ ఇంకొకటి. కాశీనాథుని నాగేశ్వరరావు వంటివారు చరిత్రలో అరుదుగా కనిపిస్తారు. ఆయన తెలుగువాడు కావడం నిజంగానే గర్వకారణం.

ఈయన...జైల్లోనే "భగవద్గీత" మీద వ్యాసాలు వ్రాశారు... "భగవద్గీత ఒక్క విశ్వాసానికో ఒక్క ధర్మానికో చెందినది కాదు" అని పేర్కొనేవారు.

వీరు కొనుగోలు చేసిన గృహములో జరిగిన ఒప్పందమె శ్రీబాగ్ ఒప్పందం అంటారు. "శ్రీబాగ్" అంటే వీరి గృహము పేరు. గాంధీగారు చెన్న పట్నానికి వచ్చినప్పుడల్లా శ్రీబాగ్ నే వారికి విడిది.

మరణం:

కాశీనాథుని నాగేశ్వరరావు గారు 1938లో మరణించారు. తెలుగు జాతికీ, తెలుగు భాషకూ, తెలుగు సంస్కృతికీ ఆయన సేవ ఎనలేనిది. వీరు అల్లుడు శివలెంక శంభు ప్రసాద్ గారు పంతులు గారి తదనంతరం ప్రముఖ పత్రికలను చాలా కాలం నడిపి అభివృద్ధి చేశారు

తమిళనాడు ప్రభుత్వం వీరి గృహానికి చుట్టు పక్కల ప్రాంతాన్ని వీరి గౌరవార్థం the "నాగేశ్వరపురం" అని నామకరణం చేసింది.

భారతదేశానికి వీరు చేసిన సేవలకు గుర్తుగా వీరిని "దేశోద్ధారక నాగేశ్వరరావు గారు" అని సంబోధించి భారత ప్రభుత్వం వీరి ముఖచిత్రంతో పోస్టల్ స్టాంప్ ముద్రించినది. ●

Compliments from

Sri Krishna Bhat

When you come to
Holy Pilgrimage Centre Tirupati & Tirumala

WOOD SIDE ANNEXE

Opp. to Govindarajulu Temple, 20. E.car Street, Tirupathi.

WOODSIDE
HOTEL WOODSIDE

E.Car Street, Tirupathi. Ph : 2284464

We Provide your comfortable Stay and Tasty Food Hospitality

b-d

Bhimas Deluxe Hotel

(PROPRIETORS BHIMAS HOTELS LIMITED)

34-38, G.Car Street (Near Railway Station),
TIRUPATI - 517 501 (A.P.)
Phone : 0877-2225521, 6669199, Fax : 2225471
Website : www.bhimasdeluxehotels.com
E-mail : bhimasdeluxe@rediffmail.com

జీ.వి. రావ్ పేజీ

(గోటేటి వేంకటేశ్వరరావు)

మనమందరం కష్టపడి శ్రమించాలి మనందరి కృషిపైన భావిభారత భాగ్యోదయం ఆధారపడి వుంది.

- స్వామి వివేకానంద

భారతదేశం ఒక అద్వితీయ దేశం. ఎన్నో విదేశీ దండయాత్రలకు గురైనా తనదైన సంస్కృతిని నిలబెట్టుకుంది. తన ఉనికిని పోగొట్టుకోలేదు. ఐదువేల ఏళ్ళ చరిత్రలో ఎప్పుడు భారతదేశం తనకు తానుగా ఏ దేశంపైనా దండయాత్ర చెయ్యలేదు. ప్రపంచం మన మాతృభూమికి ఎంతో ఋణపడి వుంది. ప్రతి దేశం క్షమామయుడైన హిందువుకు ఋణపడినంతగా మరే జాతికి ఋణపడి లేదు. గ్రీకు దేశం పుట్టకముందు నుంచి, ఐరోపా జాతుల వారు అడవుల్లో తిరుగుతున్న కాలంలోనే భారతదేశం నుంచి ధర్మ ప్రచారాలు సాగాయి. మన దేశ పురాణగాథల్లో ప్రతి మాట ముందర ఒక శాంతి సందేశం, ప్రతి వాక్కు ఒక అనుగ్రహ పూర్వకంగా పలికాయి. సామరస్య భావం గురించి, మనిషిలోని దివ్యత్వం గురించి మన భారతదేశం కొన్ని వేల ఏళ్ళకు ముందే గుర్తించింది.

అటువంటి భారతదేశాన్ని, దాని సంస్కృతి, సాంప్రదాయాన్ని దైవం పట్ల వున్న విశ్వాసాన్ని ముఖ్యంగా హిందూ జాతిని నాశనం చెయ్యడానికి కుట్ర జరుగుతూ వుంటే, మనకి ఏమి పట్టనట్టు వూరుకొన్నాం. ఒక ప్రక్క అన్యమత ప్రచారం జరుగుతోందని తెలిసినా లేదని బుకాయిస్తున్నాం. అయ్యప్ప భక్తుల విశ్వాసాన్ని దెబ్బతీసినా వూరుకున్నాం. మరో ప్రక్క హిందు జాతిని బాంబులు పెట్టి చంపుతూ కాశ్మీర్‌లో హిందూ కుటుంబాల్ని మాత్రమే హతమారుస్తూ వుంటే అందరం నోరుమూసుకుని వూరుకున్నాం. హిందువులందరికీ ఇవి దుర్దినాలు. శంకరాచార్యులు వారు చెప్పినట్లు "దుర్బలాన్ అజితేంద్రియాన్ ప్రాప్య యోగో నష్టః" అంటే ధర్మం అనేది ఆచరణశూన్యులు, అజితేంద్రియులు (అంటే సంయమనం లేనివారు) దుర్బరుల చేతిలో పడి నశిస్తుంది. దీనిని సమాజంలోని ఏ పెద్దలు నోరు తెరిచి గర్హించకపోవడం ఆశ్చర్యం. అవమానకరం. వారు ఎంత పెద్దవారలైనా సరే వారి పేరుకి వెనుక ఎన్ని పట్టాలు (డిగ్రీలు) వున్నా, ఎన్ని హోదాలు వున్నా, మఠాధిపతులు, పీఠాధిపతులు, స్వామీజీలు ఎందరుండి ఏం లాభం వారందరు (ద్రౌపది వస్త్రాపహరణం జరుగుతున్నప్పుడు కౌరవ సభలోని నోరు మెదపని భీష్మ, ద్రోణాచార్యులకు సమమే.

రాయప్రోలు సుబ్బారావు గారన్నట్లు
ఏ పూర్వపుణ్యమో ఏ యోగ బలమో
జనియించినా నీ స్వర్గ ఖండమున
ఏ మంచి పూవులన్ ప్రేమించినావో
నిను మోచె ఈ తల్లి కనక గర్భమున.

ఇటువంటి ఈ స్వర్గభూమిలో జన్మించి, ఆ భారతమాత గర్వించేలా జీవించాలి కాని, ఆ తల్లి మనస్సు నొప్పింప కూడదు.

ఎవరికి లేని బాధ నీకెందుకు అని నన్ను అందరూ వారిస్తున్నా నా మనసులోని మాట వ్రాయక తప్పటంలేదు.

✧ ✧ ✧

ఆరోగ్యంగా వుండటానికి మన పూర్వులు మనకు యిచ్చిన దారిని మరచి బాధపడి ప్రయోజనం ఏముంది? మనయొక్క జీవితం మూడు అంశాలపై పెనవేసుకొని వుంది.

1. మనసు (నిజం-నడవడి (నడత))
2. వాక్కు (సత్యం - నిజం)
3. గాయం (దేహము- శరీరము)

పై మూడింటిని మనం ఎంత జాగ్రత్తతో, జాగరూకతతో వుంచుకొని మసలుకుంటామో, మనం అంత ఆరోగ్యకరంగా వుంటాం. మన పూర్వీకులు వంద సంవత్సరాలు బ్రతికారు. అదీ అరోగ్యంగా అంటే దానికి కారణం పై మూడు గుణాలే. వీటిలో ఏ ఒకటి చెడినను లేక సరిగ్గా లేకపోయినను దాని ప్రభావం మిగిలిన రెండింటిమీద పడుతుంది. మన భారతభూమి నందు జన్మించిన ఎందరో ఋషులు, మహాత్ములు, సిద్ధపురుషులు పై మూడింటిని ఎలా కాపాడుకోవాలో, ఎలా ఆచరించాలో చెప్పారు. సర్వులూ సుఖంగా వుండాలని, ఎవ్వరికి రోగాలు రాకూడదని, అందరూ మంచిగ మనాలని దుఃఖాన్ని అనుభవించకూడదని మనకి ఎన్నో గ్రంథాలు అందించారు. గోపురం లేదు, దేవుడు లేదు అంటూ గద్దెనెక్కి ఉపన్యాసాలిచ్చే రాజకీయ నాయకులు, నాస్తికవాదులు కూడా వారి అవసాన దశలో ఆరోగ్యం సరిలేనప్పుడు ఈ ప్రాణయామం యోగమును అభ్యసించినవారే. ఈ ప్రాణాయామం, యోగం, భక్తి యోగం, రాజయోగం, హటయోగం, ధ్యానయోగం మొదలగు గ్రంథాలన్నీ ప్రపంచానికి అందించినవారు మన భారతభూమిలో జన్మించిన యోగులే!

మన యోగులు అందించిన యోగసూత్రాల్ని, అమెరికా, ఇంగ్లాండ్, జర్మనీ, ఆస్ట్రేలియాలోని ప్రజలు ఆచరించి, మందులు, మాత్రలు లేకుండా ఆరోగ్యంగా వుండటానికి ప్రయత్నిస్తూ వుంటే, మనం పాశ్చాత్య వ్యామోహంలో వాటి గురించి పట్టించుకోకుండా వుంటున్నాం.

ఈ ఆరోగ్య సూత్రాలను పాటించి మెంటల్ స్ట్రెయిన్, ఫిజికల్ స్ట్రెయిన్, బ్లడ్ ప్రెషర్ మొదలగు రోగాల నుంచి పాశ్చాత్యులు ఉపశమనం పొందుతూ వుంటే, ఈ రోగాలు భారతదేశంలో ఎక్కువయ్యాయి. కారణం పాశ్యాత్యులు విసిగి వేసారి వదలేసినవన్నీ మనం పాటించడమే. పాశ్చాత్యులు క్రమక్రమంగా భారతదేశంలోని ఆధ్యాత్మిక సంస్కృతి పట్ల మరింతగా ఆకర్షితులవుతున్నారు. కానీ మన దేశస్థులు మన సంస్కృతిని నిర్లక్ష్యం చేసి, పాశాత్య సంస్కృతిని అనుసరించడం ఎంతో హాస్యాస్పదం.

యాంత్రికమైన, అసంబద్ధంగా దిగజారిన జీవన విదానాన్ని యోగా వేదాంత పద్ధతులతో కూడిన భారతీయ జీవన విధానం పరిష్కారం చూపగలదని గ్రహించాలి. మనసు, వాక్కు, దేహం, వీటికి ఒకదానితో ఒకటి సంబంధం వున్నందువల్ల, ఒకదానినొకటి మన పూర్వులు మనకిచ్చిన ఆస్తిని (ఆరోగ్య సూత్ర గ్రంథాలను) అనుభవించి జీవితాన్ని ఆనందమయం చేసుకోవాలి.

✧ ✧ ✧

దేవుని ఎడల భక్తి, దేశం పట్ల అమితమైన భక్తి, గురువుల యెడల భక్తి, మన యొక్క పురాణ గ్రంథాలుచ వేదాలపట్ల భక్తి, విశ్వాసం, సిద్ధ పురుషులు, సాధుపుంగవులు పట్ల భక్తి, మనయొక్క ఆచార వ్యవహారాలు, సంస్కృతి సంప్రదాయాలపై నున్న గౌరవంతోనూ, నేను పుట్టిన ఇంటికి గౌరవం తెచ్చేవిధంగానూ వుండాలనే ఎప్పుడూ కోరుకుంటూ వుంటాను. జీవిరావు పేజీలలో కూడా ఎక్కువగా అవే ఆలోచనలు ప్రతిబింబిస్తూ వుంటాయి. ఎన్నో మంది ఎన్నో రకాలుగా దండెత్తినా ఎప్పటికి తరగనిది, చెరిగిపోనిది, నశింపబడనిది మన సనాతన ధర్మం. భారతదేశ సంస్కృతి అతి పురాతనమైనది. అనాది కాలంగా వున్నది. మిగిలిన సంస్కృతుల కన్నా వేల సంవత్సరాల ముందునుంచి సంస్కృతి వున్నది. మన పురాణాలను, దేవుళ్ళను అపహాస్యం చేస్తూ, హేళన చేస్తూ, ఓట్ల కోసం కొంతమంది (రాజకీయ నాయకులు), డబ్బుల కోసం కొంతమంది (సినిమావారు), పేరు కోసం కొంతమంది (పత్రికలలోను, టీవిలలోను వారి పేరు రావాలని) వున్నారు. నేటి చౌకబారు సినిమా కథకులు మాత్రం దేవుళ్ళను వాళ్ళిష్టం వచ్చినట్లు వాడుతుండడం శోచనీయమైన విషయం. నోరుమూసుకొని వున్నారు కదా అని ఎలాపడితే అలా సినిమాలు తియ్యడం సరికాదు. ఇలా చేస్తున్నవారిని ఆవిడ ఎవరో ఒక మహిళా రచయితను కొట్టారే అలా కొట్టవచ్చు కదా అని ఒక పెద్దాయన బాధగా కామెంట్ చేసారు. మనం ఏమి చెయ్యక్కరలేదు. ఇటువంటి వాటికి గరుడపురాణంలో చెప్పబడిన విధంగా శిక్ష ఏమిటయ్యా అంటే మన పురాణాలను అపహాస్యం హేళన

శ్రీ గోటేటి శ్రీరామారావు గారి పుత్రులు

శ్రీ గోటేటి వేంకటేశ్వరరావు గారికి నమస్కరించి భువనచంద్ర వ్రాయునది. "జనవరి" ప్రముఖాంధ్రలో నాన్నగారి 'సంపాదకీయం' మరోసారి చదివే అవకాశాన్ని మాకు కలిగించినందుకు మొదటగా నా వందనాలు, అభినందనలు అందుకోండి.

ప్రతి జీవితమూ ఇద్దరి తల్లుల మధ్యన జరిగే పయనమే. మొదటి తల్లి కన్నతల్లి. 9 నెలలు ఆమె గర్భంలో పెరిగి నేలతల్లి ఒడిలోకి వస్తాము. ఒక్కసారి కన్నతల్లి ఒడినించి బయటికొచ్చాక తిరిగి వెళ్ళలేము (లోపలికి).

అలాగే ఈ నేలతల్లి ఒడిలో డెభ్భై ఏళ్ళో, ఎనభై ఏళ్ళో, నిండు నూరేళ్ళో బ్రతికి చివరిగా నేలతల్లి ఒడిలోకి చేరిపోతాము. నేలతల్లి లోపలికెళ్ళాక మళ్ళీ బయటకు రాలేము.



ఈ ప్రయాణంలో నేలతల్లి గర్భంలోకి వెళ్ళి కూడా 'బయట' మిగిలే వారు ఉంటారు. వారే మహానుభావులూ, రుషులూ, రుషితుల్యులూ. నాన్నగారు కూడా అటువంటి వారే అనడంలో ఏ సందేహమూ లేదు.

వారి జీవితమంతా ఏ మచ్చా పడని ఓ తెల్ల కాయితం. వారి ఆదేశాన్ని మీరు శిరసా వహిస్తున్నందుకూ, వారు వెలిగించిన అఖండ జ్యోతిని మీరు ముందుకు తీసుకు వెళ్తున్నందుకూ మనసారా మిమ్మల్ని అభినందిస్తూ ఈ 'గోటేటి' పరంపర ఆచంద్రతారార్కం వర్ధిల్లాలని కోరుకుంటూ...

నమస్సులతో... మీ

భువనచంద్ర

చేస్తే క్రిమిభోజనం అనే నరకం, కనీసం వంద జన్మలు పంది పుట్టుక వుంటుందట. పరిస్థితులు ఎప్పుడూ ఇలాగా వుండవు. చక్రం తిరిగినట్టుగా తిరుగుతూ వుంటాయి. 'అలా అన్నీ తలక్రిందులయినప్పుడు వీరి ఆటలు సాగవు. భగవంతుడు తాను ప్రేమగా సృష్టించిన జనులను నాశనం చెయ్యడానికి యిష్టపడడు. దీన్ని మనం గ్రహించి నడచుకోవాలి. ఇక్కడ ఇంకొక కథ చెప్తాను.

ఒక సాధువు ఆశ్రమంలో చిన్న ఎలుక వుండేది. ఒకరోజు పిల్లి దానిని పట్టుకోబోయింది. ఆ సాధువు జాలిపడి ఆ ఎలుకని పిల్లిలా మార్చాడు. అయితే ఈ కొత్త పిల్లిని చూసి కొన్ని కుక్కలు కరువబోయాయి. ఆ సాధువు పిల్లిని కుక్కగా మార్చాడు. ఆ కుక్కని ఒక చిరుతపులి హింసించటంచూసి మళ్ళీ జాలిపడిన సాధువు దానిని పులిగా మార్చాడు. పులిగా మారిన ఆ జంతువు సాధువునే మింగేయ్యాలని చూసింది. ఆ సాధువు దానిని మరలా ఎలుకగా మార్చేసాడు. భగవంతుడు మనల్ని సృష్టించి మనకు కొన్ని తెలివితేటలను యిచ్చాడు. వాటిని సక్రమ మార్గంలో ఉపయోగించినవారు చంద్రమండలం దాకా ప్రయాణమయి వెళ్లారు. వైద్య వృత్తిలో వున్నవారు ఒక మనిషిని బ్రతికించే స్థాయికి చేరుకున్నారు. శాస్త్రవేత్తలు ఎంతో ప్రగతిని సాధించెట్టు చేసాడు. అవన్నీ దేవుని కృప వల్లే జరిగిందని భావించాలి కానీ అది మనయొక్క గొప్పదనం అని భావించి ఆఖరికి దేవుడే లేడనే భావన మనకు కలుగుతుందో ఆ ఎలుక కన్నా హీనస్థితి మనకు ఏర్పడుతుంది. అలా జరగకండా ప్రయత్నించండి. ఆ దేవుని ఎలా ప్రసన్నం చేసుకోవాలో తెలుసు కోండి. అంతేకాని హేళన, హాస్యం చేస్తూ మీకు, మీ కుటుంబానికీ లేనిపోని అనర్ధాలు తెచ్చిపెట్టుకోకండి. నాలాంటివారు మాకు తెలిసినవి చెపుతూనే వుంటాం. వినేవారికి ఆశక్తి వున్నా లేకపోయినా మా పనిని మానం. తత్కాల శ్రోతలకు లేదా పఠితలకు ప్రయోజనం కలిగిస్తుందా లేదా అని ఆలోచించం– ఆశావాదం మాచేత యిలా వ్రాయిస్తూనే వుంటుంది. జనం నిజం తెలుసుకొని పరిస్థితులు మారతాయనీ భావన మాలాంటివారికి ఊపిరి. ●